



ఇంటర్ కాలేజీ మంజూరుకు చొరవ చూపాలి



» అసెంబ్లీలో ఎమ్మెల్యే దివ్య

తునిరూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తొండంగి మండలం రావికంపాడులో జడ్పీ ఉన్నతపాఠశాలలను ఇంటర్ కళాశాలగా అప్ గ్రేడ్ చేయాలని తుని ఎమ్మెల్యే యనమల దివ్య కోరారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో రావికంపాడులో ఇంటర్ కళాశాల ఆవశ్యకతను ఆమె సవివరంగా సభ దృష్టికి తీసుకెళ్లారు. ఇంటర్ కళాశాల ఏర్పాటు ద్వారా పేద, మధ్య తరగతి విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి లోకేశ్ స్పందిస్తూ మండలానికి ఒక జూనియర్ కళాశాల ఉండాలన్నది ప్రభుత్వ నిర్ణయమని, దానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. ప్రభుత్వ కళాశాలలో 40శాతం అడ్మిషన్ మెరుగుపరిచామని, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశామని, ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలు తీర్చిదిద్దుతామని మంత్రి బదులిచ్చారు.

టీడీఆర్ బాండ్ల కుంభకోణం నిందితులపై చర్యలు చేపట్టాలి



» అసెంబ్లీలో ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడసిటీ, సెప్టెంబరు 24(ఆంధ్ర జ్యోతి): గత వైసీపీ పాలనలో కాకినాడలో ప్రభుత్వ భూములపై టీడీఆర్ బాండ్లు మంజూరు చేయించి దోచుకున్న నిందితులపై చర్యలు చేపట్టాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కోరారు. శాసనసభలో బుధవారం ఆయన ఈవిషయాన్ని ప్రస్తావిస్తూ గతప్రభుత్వపాలనలో కాకినాడ నగరంలో ప్రభుత్వ భూములపై టీడీఆర్ బాండ్లు మంజూరు చేయించుకుని కార్పొరేషన్ నిధులను దుర్వినియోగం చేశారన్నారు. దీనిపై అనేకసార్లు ఫిర్యాదు చేసినా అప్పటి వైసీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విజిలెన్స్ దర్యాప్తు చేశామన్నారు. కానీ, నిందితులపై చర్యలు తీసుకోలేదన్నారు. అందువల్ల టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై సమగ్ర విచారణ చేపట్టి నిందితులను శిక్షించాలని విన్నవించారు.

విద్యుత్‌శాఖ..
బంపర్ ఆఫర్

» అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు 50శాతం రాయితీ
» డిసెంబరు ఆఖరు వరకూ గడువు

సామర్లకోట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గృహ వినియోగదారులకు విద్యుత్‌శాఖ బంపర్ ఆఫర్ ఇచ్చింది. అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు 50శాతం రాయితీతోపాటు డిసెంబరు నెలాఖరు వరకూ గడువు ఇచ్చింది. గృహావసరాలకు విద్యుత్ సరఫరా పొందే సమయంలో లైట్లు, ఫ్యాన్లు తదితర గృహోపకరణాల వినియోగాన్ని అంచనా వేసి లోడ్‌ను కిలోవాట్లలో లెక్కించి సెక్యూరిటీ డిపాజిట్, డెవలప్‌మెంట్ చార్జీలు వసూలు చేస్తారు. జిల్లాలో గృహవిద్యుత్ కనెక్షన్లు ఉండగా దాదాపు అన్నీ దశాబ్దాల క్రితం నాటివే.వాడే బల్బులు, ఫ్యాన్లు లెక్కల ఆధారంగా వీటిని ఇచ్చారు. తర్వాత ఎలక్ట్రానిక్స్ గృహావసరాల వస్తువుల వినియోగం బాగా పెరిగింది. ప్రతి ఇంట్లోను కనీసం ఫ్రిజ్, ఎల్ఈడీ టీవీ, ఎయిర్ కండీషనర్ వంటి ఎలక్ట్రానిక్స్ వస్తువుల వినియోగం బాగా పెరిగింది. విద్యుత్ కనెక్షన్ జారీకి అప్పట్లో చేసిన దరఖాస్తులో నమోదు చేసిన లోడ్ ప్రకారం 0.5కిలోవాట్ ఉంటే నేడు అవసరాలు పెరిగి అదే సర్వీసుపై 2 నుంచి 3 కిలోవాట్లకు పెరిగింది. నిర్దేశిత మొత్తం చెల్లించి ఈ అదనపు లోడ్‌ను క్రమబద్ధీకరించుకోవాల్సి ఉన్నా అధికశాతం వినియోగదారులు చేసుకోలేదు. అధికవిద్యుత్ వినియోగిస్తున్నా తక్కువ సామర్థ్యానికే అనుమతి తీసుకుంటున్నారు. సాధారణ రోజుల్లో ఇబ్బంది లేకున్నప్పటికీ వేసవిలో వినియోగం బాగా పెరిగి ఆ భారం సమీప డిస్ట్రిబ్యూటరీ ట్రాన్స్‌ఫార్మర్లపై పడుతుంది. దీంతో తరచూ విద్యుత్ హెచ్చుతగ్గులు, లోవోల్టేజీ, ఫ్లిక్కరింగ్ వంటి విద్యుత్ అవాంతరాలు నెలకొంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో సిబ్బంది తనిఖీల సమయంలో గుర్తిస్తే అధిక మొత్తంలో జరిమానాలు విధించి వేలల్లో అపరాధ రుసుములు, లోడ్ రుసుములు పేరిట వసూలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వినియోగదారులే స్వచ్ఛందంగా ముందుకొస్తే లోడ్ క్రమబద్ధీకరణ రుసుములో 50శాతం రాయితీ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

రాయితీలు ఇలా.. (రూ.లలో)

కిలోవాట్	అసలు	రాయితీ
1 కిలోవాట్	2,250	1,250
2 కిలోవాట్	4,450	2,450
3 కిలోవాట్	6,650	3,650
4 కిలోవాట్	8,850	4,850
5 కిలోవాట్	11,050	6,050

కాకినాడ జిల్లాలో కాకినాడ, జగ్గంపేట, పెద్దాపురం విద్యుత్ ఈఈ కార్యాలయాల పరిధిలోని పట్టణాలు, గ్రామాల్లో 6,69,067 గృహావసర విద్యుత్ సర్వీసులు ఉన్నట్లు జిల్లా విద్యుత్ ఎస్ఈ కార్యాలయంలో అందిన సమాచారంగా ఉంది.

వీటిలో కాకినాడ ఈఈ కార్యాలయ పరిధిలో 2,87,932 విద్యుత్ సర్వీసులు

పెద్దాపురం ఈఈ కార్యాలయ పరిధిలో 1,70,525 విద్యుత్ సర్వీసులు

జగ్గంపేట ఈఈ కార్యాలయ పరిధిలో 2,10,610 విద్యుత్ సర్వీసులు ఉన్నాయి.



మెడిసిన్ తగ్గలే..

జీఎస్టీ తగ్గింపు ప్రయోజనం నేరుగా ప్రజలకు చేరాలన్నదే కేంద్ర ప్రభుత్వ అభిమతం. కానీ ఆ ప్రయోజనం ఇప్పటిదాకా లక్ష్యాన్ని చేరలేదు. మార్కెట్‌లో వేలాది రకాల వస్తువుల ధరలపై జీఎస్టీ తగ్గింపు వర్తించింది. సోమవారం నుంచి రెండు శ్లాబుల జీఎస్టీ అమలులోకి వచ్చింది. దాంతో ఈ విధానంలో ప్రకటించిన వస్తువుల ధరలన్నీ తగ్గిపోవాలి. కానీ ఆ పరిస్థితి ఏవో కొన్ని వస్తువులు మినహా పెద్దగా ఆ ప్రభావం కనిపించలేదు. అంతెందుకు రోజూ కొనుగోలు చేసే కొన్ని కంపెనీల పాల ప్యాకెట్ ధర కూడా ఇప్పటివరకు తగ్గలేదు. ఇక వైద్యానికి సంబంధించి అత్యవసర మందులు, వస్తువులపై కొత్త జీఎస్టీలో తగ్గింపులు ఉన్నాయి. కానీ ఆ తగ్గింపేమీ కనిపించడం లేదు. పాత ఎమ్మార్పీవి అంటూ మెడికల్ షాపుల వారు దోపిడీ చేసేస్తున్నారు.

» జీఎస్టీ తగ్గింపులో మందుల్లో మతలబు
» పాత ఎంఆర్పీలంటూ దోపిడీ
» అత్యవసర మందులపైనా మోసం
» ఉమ్మడి తూర్పులో 3 వేల మెడికల్ షాపులు
» అవగాహన లేమితో రూ.కోట్లలో ప్రజలకు నష్టం
» మూమూళ్ల మత్తులో డ్రగ్స్.. పట్టించుకోని వాణిజ్యం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మందుల ఖర్చు చూసి ఇవాళ రోగం మరింత ముదిరిపోతోంది. ఓవైపు అధిక శాతం డాక్టర్లు మందులతో చీటీలను పూర్తిగా నింపేస్తుంటే.. మరోవైపు మందుల దుకాణాల వాళ్లు ఎడాపెడా దోచేస్తున్నారు. చాలా ఆస్పత్రుల్లో సొంత మెడికల్ షాపులు ఉండడంతో ఇదో అదనపు వ్యాపారంగా మారిపోయింది. బయట షాపుల్లో ఎంఆర్పీపై ఏకంగా 20 శాతం వరకూ తగ్గింపు ఇస్తామంటూ వ్యాపారస్తులు పోటీ పడుతూ ఉంటారు. ఆస్పత్రుల్లోని మెడికల్ షాపుల్లో ఆ రాయితీ వర్తించదు. పైగా మందుల ధర వాస్తవంగా ఎంతో వాటిపై ఉండదు. ఎంఆర్పీ మాత్రమే ఉంటుంది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం మందులపై జీఎస్టీని గణనీయంగా తగ్గించింది. అత్యవసర మందులపై పన్ను ఎత్తేసింది. కానీ ప్రజలకు మాత్రం ఆ మేరకు జేబుకు ఆదా కనబడడం లేదు. అధిక శాతం దుకాణాల్లో బిల్లులు కూడా ఇవ్వకపోవడంతో జీఎస్టీ తగ్గింపు తెలియడం లేదు.

● ఇలా దోపిడీ...

ఓ వ్యక్తి రాజమహేంద్రవరంలోని హైటెక్ బస్టాండు సమీపంలో ఓ పెద్ద మందుల షాపునకు వెళ్లి 10 ట్యాబ్లెట్ల స్ట్రిప్ కొన్నాడు. దానిపై రూ.335 ఎంఆర్పీ ధర ఉంది. తమ వద్ద ప్రత్యేక రాయితీ అంటూ రూ.284 తీసుకున్నారు. వినియోగదారుడు సంతోషించి.. బిల్లు అడిగాడు. దీంతో రూ.266కి బిల్లు ఇచ్చారు. అదేంటని ప్రశ్నిస్తే జీఎస్టీ తగ్గింపని సెలవిచ్చారు. ఒకవేళ బిల్లు తీసుకోకపోతే నష్టపోయేవాడే కదా. మరో వ్యక్తి హార్లిక్స్ కొన్నాడు. దాని ఎంఆర్పీపై 7శాతం తగ్గించారు. అది తమ షాపులో మాత్రమే ఇచ్చే తగ్గింపని చెప్పాడు. జీఎస్టీ తగ్గింపుపై ప్రశ్నించగా.. ఆ స్టాకు పాత ఎంఆర్పీతో ఉందని జీఎస్టీ తగ్గింపు రాదని సెలవిచ్చాడు. ఇది కేవలం ఆ ఇద్దరికి జరిగిన తంతు మాత్రమే కాదు. నూటికి 99శాతం మందికి మందులపై జీఎస్టీ ఆదా చేకూరడం లేదు. వందల రకాల మందులు ఉండడంతో బోర్డులు పెట్టడం సాధ్యం కాదనుకున్నా.. కనీసం బిల్లులు పక్కాగా ఇస్తూ, వాటిలో జీఎస్టీ తగ్గింపును స్పష్టంగా పేర్కొంటే వినియోగదారుడికి సొమ్ము ఆదా అవుతుంది.

● అంతా అయోమయం

చాలా మందుల షాపుల్లో బిల్లులు ఇవ్వడం లేదు. దీంతో జీఎస్టీ తగ్గింపు వర్తింపు అయోమయంగా మారింది. బిల్లులు ఇవ్వకపోవడంపై వాణిజ్య పన్నుల శాఖ పట్టించుకున్న దాఖలాలు లేవనే చెప్పవచ్చు. దీంతో తాము కొన్న మందులకు ఇటీవల తగ్గించిన జీఎస్టీ వర్తించిందో లేదో వినియోగదారుడికి తెలియడం లేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 3 వేల వరకూ మందుల షాపులుండగా.. 150 వరకూ పెద్ద దుకాణాలు ఉన్నాయి. ఈ పెద్ద దుకాణాల్లో బిల్లులు ఇస్తున్నా జీఎస్టీ తగ్గింపు చూపించడం లేదు. అత్యవసర, క్యాన్సర్ మందులపై జీఎస్టీ గతంలో 5% నుంచి 12% వరకూ ఉండేది. దానిని పూర్తిగా తీసేశారు. జనానికి అత్యవసర మందులపై అవగాహన ఉండదు. వైద్యుడు ఇచ్చిన చీటీ ప్రకారం మందులు తెచ్చుకుంటారు. అత్యవసర మందులతోపాటు సాధారణ మందులను ఒకే చీటీలో రాస్తారు. దీంతో సందట్లో సడేమియా మాదిరిగా అత్యవసర మందులకు జీఎస్టీ తగ్గింపు ఇవ్వడం లేదు. ఉదాహరణకు అత్యవసర మందుల ధర రూ.5 వేలు అనుకొంటే గతంలో రూ.250-600 వరకూ జీఎస్టీ ఉండేది. ఇప్పుడు పూర్తిగా మినహాయించడంతో ఆ మేరకు తగ్గించాల్సి ఉంది. కానీ ఆ లాభం వినియోగదారుడికి అందడం లేదు. గ్లూకోమీటర్, టెస్ట్ స్ట్రిప్‌లు, థర్మామీటర్లు, డయాగ్నస్టిక్ రసాయనాలు/కిట్లు, ఇతర మందులపై జీఎస్టీని 18/12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించారు. కానీ వాటిపై ఆ తగ్గింపును వర్తింపజేయడం లేదు. ఉమ్మడి తూర్పుగోదావరిలోని రాజమహేంద్రవరం, కాకినాడ మెడికల్ హబ్‌లుగా కొనసాగుతున్నాయి. దీంతో రోజుకు కోట్లాది రూపాయల మెడిసిన్ ఇతర వైద్య పరికరాలు/వస్తువుల అమ్మకాలు జరుగుతాయి. ఇప్పుడు జీఎస్టీ తగ్గింపు వినియోగదారుడికి చేరకపోవడంతో కేంద్రం ఉద్దేశం నిర్వీర్యమవుతోంది. ఇప్పటికైనా డ్రగ్స్ శాఖ మత్తు వీడితే ప్రజలకు మేలు జరుగుతుంది. వాణిజ్య పన్నుల శాఖ దృష్టి సారిస్తే బిల్లులు మేల్కొంటాయి.

● ఇదో మాయాజాలం

సొంతంగా ఆస్పత్రుల్లోనే మెడికల్ షాపులు ఉండడంతో చాలామంది ప్రిస్క్రిప్షన్ నిండిపోయే వరకూ మందులు రాసేస్తున్నారు. బయట మెడికల్ షాపుల్లో ఇచ్చే రాయితీ కూడా వీళ్లు ఇవ్వడం లేదు. అంటే మందులపై ఎంత లాభం ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. దీని వెనుక మరో ఆశ్చర్యపోయే మాయ దాగి ఉంది. గతంలో మందుల తయారీ కంపెనీలు రిప్రజెంటేటివ్‌ని నియమించుకొని వాళ్లను డాక్టరు వద్దకు పంపించి ప్రొడక్టును ప్రచారం చేసుకోవడం జరిగేది. దీనిని ఎథికల్ మార్కెటింగ్ అనేవాళ్లు. హరియాణా, గుజరాత్‌లోని పలు మూరుమూల ప్రాంతాల్లో మందుల తయారీ కంపెనీలు కోకొల్లలుగా ఉంటాయి. మెడికల్ రిప్రజెంటేటివ్‌లుగా అనుభవం వచ్చిన తర్వాత కొందరు డాక్టర్ల వద్ద ఆర్డర్లు తీసుకొని సొంతంగా ఆ ప్రాంతాలకు వెళ్లి పెద్ద మొత్తంలో మందులు కొనుగోలు చేసి తీసుకురావడం మొదలైంది. దీనిని ప్రొపగాండా కం డిస్ట్రిబ్యూషన్(పీసీడీ) అంటారు. ఇలా మొదలైన ఆ ఒరవడి డాక్టర్లు ఒక బాక్సు కొంటే పది బాక్సులు ఉచితంగా ఇచ్చే స్థాయికి వెళ్లింది. ఇది గమనించిన కొందరు డాక్టర్లు కలిపి నేరుగా రంగంలోకి దిగారు. అలా వాళ్లే సొంతంగా వెళ్లి మందులు తెచ్చుకోవడం మొదలుపెట్టారు. ఉదాహరణకు పెంటాప్రజోల్ షీటు ధర తయారీ కేంద్రం వద్ద రూ.5 ఉంటే మన చేతికి వచ్చేసరికి రూ.150 అవుతుందన్నమాట. వాస్తవానికి కంపెనీ పెట్టిన పేరుకాకుండా ప్రిస్క్రిప్షన్‌లో ఔషధం పేరు రాయాలనే నిబంధనను ఎప్పుడో చంపేశారు. యాంటిబయోటిక్స్ తక్కువగా సూచించాలని నాటితరం వైద్యులు నెత్తీనోరు బాదుకుంటున్నా తమ వ్యాపారం కోసం వైరల్ ఫీవర్‌కి సెఫిక్జిమో ఒప లాక్సిన్ వంటి యాంటిబయోటిక్స్ చీటీల్లో నింపేస్తున్నారు.

దసరాకి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు

కార్పొరేషన్(కాకినాడ),సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): దసరా పురస్కరించుకుని హైదరాబాద్‌నుంచి కాకినాడ జిల్లాకు ప్రయాణికులను తీసుకువచ్చేందుకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేశామని జిల్లా ప్రజారవాణాధికారి ఎం.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్‌గా హైదరాబాద్ నుంచి జిల్లాకు వచ్చే 9 సర్వీసుల రిజర్వేషన్లు ఫుల్ కావడంతో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ప్రతిరోజూ హైదరాబాద్‌నుంచి కాకినాడకు 7, ఏలేశ్వరం 1, తునికి 1 సర్వీసు నడుపుతున్నారు. అక్కడినుంచి రిజర్వేషన్లు పూర్తికావడంతో హైదరాబాద్ నుంచి ఈనెల 30న నాలుగు బస్సులు, అక్టోబరు 1న ఏడు సర్వీసులను ఏర్పాటు చేశారు. దసరా సెలవులు పూర్తయి తిరిగి హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణీకుల కోసం ప్రత్యేక సర్వీసులను వచ్చే నెల 3, 4 తేదీల్లో ఏర్పాటు చేశారు. విజయవాడకు రద్దీను బట్టి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామని డీపీటీవో తెలిపారు.

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై దృష్టి పెట్టాలి: జేసీ

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై అన్ని ప్రభుత్వశాఖల అధికారులు ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించాలని జేసీ రాహుల్‌మీనా ఆదేశించారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్‌నుంచి ఆయన స్వచ్ఛభారత్, ఏక్ దిన్ ఏక్ గంటా ఏక్‌సాత్ దేశవ్యాప్త పరిశుభ్రత కార్యక్రమం, డోర్‌టూడోర్ చెత్త సేకరణ వంటి అంశాలపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబరు 2వతేదీకి సంబంధించి స్వచ్ఛతా హీసేవా కార్యక్రమాలకు సంబంధించిన షెడ్యూల్ తయారు చేయాలన్నారు. అక్టోబరు 2న జిల్లాలకు అవార్డులు ప్రకటించడం జరుగుతుందన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే జిల్లాగా ప్రజలను భాగస్వాములను చేయాలని, జ్యూట్ బ్యాగులు వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డీఆర్వో వెంకట్రావు, డీపీవో రవికుమార్ పాల్గొన్నారు.

నేడు జిల్లాలో 'ఏక్ దిన్-ఏక్ ఘంటా-ఏక్ సాథ్': కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం ఏక్ దిన్, ఏక్ ఘంటా, ఏక్ సాథ్ అనే పరిశుభ్రత కార్యక్రమం విధిగా నిర్వహించాలని కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశించారు. ఈమేరకు ఆయన ఒక ప్రకటన వెలువరించారు. స్వచ్ఛతాహీసేవా ప్రచారం కింద పౌరులను తమ పరిసరాలను శుభ్రపర్చడానికి, పరిశుభ్రత సంస్కృతిని ప్రోత్సహించడానికి ప్రధాని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ఉదయం 8 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. దీనిద్వారా బహిరంగ ప్రదేశాల్లో పరిశుభ్రత ప్రచార కార్యక్రమాలు చేయాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలన్నారు. పారిశుధ్య కార్మికులకు మద్దతు పలకాలన్నారు. జిల్లాస్థాయి, డివిజన్‌స్థాయి, మండలస్థాయిలో అధికారులు పాల్గొనాలన్నారు. మున్సిపాల్టీలు, పంచాయతీలు, విద్యాసంస్థలు, యువజన సంఘాలు, ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

శ్రీపీఠంలో వారాహి అమ్మవారు



శ్రీపీఠంలో ప్రత్యేక అలంకరణలో వారాహి అమ్మవారు

రేషనలైజేషన్‌లో కొత్తగా 183 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రేషనలైజేషన్ ప్రక్రియలో భాగంగా జిల్లాలో కొత్తగా 183 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించామని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు తెలిపారు. కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతి నిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు జిల్లాలో చేపట్టిన పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్, ఓటరు జాబితాల స్పెషల్ ఇన్టెన్సివ్ రివిజన్, జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపుల కోసం అందిన దరఖాస్తుల పరిష్కారం, బూత్ స్థాయి అధికారుల శిక్షణపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2002లో నిర్వహించిన ఎస్ఐఆర్ ఓటరు జాబితాల రిఫరెన్స్‌గా ప్రస్తుత ఎస్ఐఆర్ జరుగుతుందన్నారు. ఈ నెలాఖరు నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేస్తారన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్, లోకేషన్ మార్పులు, ఓటర్ల సంఖ్య గరిష్ఠ పరిమితి 1150గా కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఈ ప్రతిపాదనపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో చర్చించి వారి సూచనల మేరకు అవసరమైన సవరణలతో ఎన్నికల కమిషన్ ఆమోదం కోసం పంపుతామన్నారు. జిల్లాలో 81 పోలింగ్ కేంద్రాల లోకేషన్ మార్పులు, 275 కేంద్రాల పేర్ల మార్పులు, కొత్తగా 183 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించామన్నారు. డోర్ నెంబరు లేని ఓటర్లకు డోర్ నెంబరు జీరో అని నమోదు చేస్తారన్నారు. జిల్లాలో డోర్ నెంబరు లేని ఇళ్లకు నెంబర్లు కేటాయించాలని అధికారులను ఆదేశించామన్నారు. జిల్లాలో బూత్‌స్థాయి అధికారులకు, రాజకీయ పార్టీల బూత్‌స్థాయి ఏజెంట్లకు కూడా శిక్షణ ఇస్తామన్నారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు టీవీ సాంచీ, ఎస్ అప్పారావు, సీహెచ్ రమేష్ బాబు, కరణం ప్రసాద్‌రావు, పోలిశెట్టి శ్రీనివాసరావు, గదుల సాయిబాబు, ఆర్.వెంకటేశ్వరరావు, ఏవీవీఎస్ నారాయణ, ఎన్నికల విభాగం డీటీ జగన్నాథంలు పాల్గొన్నారు.

ఈవీఎంల భద్రతకు పటిష్టమైన చర్యలు

జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఈవీఎం, వీవీప్యాట్స్ భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్ కార్యాలయంవద్ద ఉన్న ఈవీఎం గోదామును ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎం, వీవీప్యాట్స్ భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మూడునెలలకు ఒకసారి జిల్లాలో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి గోదామును పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, జిల్లా అసిస్టెంట్ అగ్నిమాపకాధికారి సుబ్బారావు, కాకినాడ అర్బన్ తహసీల్దార్ జితేంద్ర, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డీటీ జగన్నాథం, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సాయిబాబా, ఎస్.అప్పారావు, శ్రీనివాసు, వెంకటేశ్వరరావు, రమేష్‌బాబు, సత్యనారాయణ, రమణ, రెవెన్యూ, ఎన్నికలు, అగ్నిమాపక, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సంతోషంగా చలో

» జాయినింగ్ ఆర్డర్ తీసుకునేందుకు విజయవాడకు డీఎస్సీ ఉపాధ్యాయ అభ్యర్థులు
» రాజమహేంద్రవరం నుంచి పయనం

9



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామలో అన్నపూర్ణాదేవిగా మాణిక్యాంబ అమ్మవారు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజైన బుధవారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పలు ఆలయాల్లో అమ్మవార్లు వివిధ అలంకరణల్లో అభయమిచ్చారు. అన్నపూర్ణా దేవి అవతారంలో దర్శనమిచ్చిన జగన్మాతను భక్తులు దర్శించుకుని పునీతులయ్యారు. భిక్షాం దేహి కృపావలంబనకరీ మాతాన్నపూర్ణేశ్వరీ అంటూ అమ్మవారిని స్తుతించారు.



కాకినాడ జిల్లా అన్నవరంలో అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన వనదుర్గమ్మ





తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం జాంపేట గాంధీబొమ్మ సెంటర్లో కనకదుర్గ అమ్మవారికి (పైన), దేవీచౌక్ సెంటర్లో బాలాత్రిపురసుందరి అమ్మవారికి (కింద) సాయంకాల హారతి ఇస్తున్న అర్చకులు

అన్నపూర్ణాదేవి... అభయరూపిణి



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేటలో అన్నపూర్ణాదేవిగా వాసవికన్యకాపరమేశ్వరి



కాకినాడ జిల్లా పిఠాపురంలో అన్నపూర్ణాదేవి అలంకారంలో రాజరాజేశ్వరీదేవి



కాకినాడ జిల్లా సామర్లకోటలో గాయత్రీదేవిగా బాలాత్రిపురసుందరీదేవి



కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో చంద్రఘంటాదేవిగా అపర్ణాదేవి అమ్మవారు



కాకినాడ జిల్లా పిఠాపురం మండలం పి.రాయవరంలో కనకదుర్గ అమ్మవారిని కూరగాయలతో అన్నపూర్ణాదేవిగా అలంకరించిన దృశ్యం



తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు మండలం జువ్వలదొడ్డిలో ఇష్టకామేశ్వరి రూపంలో....



విశేష అలంకరణలో ఐశ్వర్యాంబిక అమ్మవారు

ఒకే వస్త్రం... ఒకే మంత్రం... ఒకే దీక్ష

వేలాది మంది మాతృమూర్తులతో మహాశక్తి యాగం

'లలిత' సినిమా పోస్టర్, ఆడియో ఆవిష్కరణ

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ రమణయ్యపేటలోని శ్రీపీఠం గోశాల ప్రాంగణంలో మహాశక్తి యాగం బుధవారం మూడో రోజుకి చేరింది. వేలాది మహిళలు ఒకే వస్త్రం... ఒకే మంత్రం... ఒకే దీక్షతో వంద కోట్ల లలితా సహస్రనామ కుంకుమార్చనలో పాల్గొన్నారు. స్వామి పరిపూర్ణానంద సరస్వతి భక్తులకు అనుగ్రహభాషణ చేస్తూ లలితా సహస్రనామం అత్యంత పవిత్రమైనది, శక్తివంతమైనది అన్నారు. అమ్మను ఆవాహన చేసుకుని నిత్యం సుమారు అరగంటసేపు లలితా సహస్రనామం పారాయణ చేస్తే ఆమె ఆశీస్సులు మెండుగా లభిస్తాయన్నారు. అమ్మ శక్తిని సాక్షాత్తూ ఆ పరమాత్ముడే గుర్తించారన్నారు. తొలుత అమ్మవారికి సహస్ర చండీ, వారాహి, ప్రత్యంగిరా, బగళాముఖి, రాజశ్యామల, వటుక భైరవ హోమం, సహస్ర రుద్ర మహా రుద్ర హోమం జరిపారు. వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు.

ప్రముఖ సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు దర్శకత్వంలో తెరకెక్కనున్న లలిత సినిమా పోస్టర్‌తో పాటు ఆడియోను స్వామి పరిపూర్ణానంద సరస్వతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి విశిష్టతను చాటిచెప్పేలా 'లలిత' పేరుతో సినిమాను తెరకెక్కించేందుకు శ్రీపీఠం చైర్మన్ సుధీర్‌రాజు ముందుకురాగా, రచన, దర్శకత్వం వహించేందుకు జొన్నవిత్తుల ముందుకు రావడం అభినందనీయమన్నారు. అమ్మవారే అమ్మాయిలా వస్తే ఎలా ఉంటుంది.... ధర్మం, ఆత్మాభిమానం, ఆత్మగౌరవం తదితర అంశాలపై ప్రపంచానికి చాటిచెప్పేలా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దిన యూనిట్ సభ్యులను అభినందించారు.

కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ కొల్లి రామగోపాల్ చౌదరి, సంగీతం: నాగరాజు, పాటలు: నాగరాజు, మణి, కెమెరామెన్: సురేందర్‌రెడ్డి, ఎడిటర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



లలిత సినిమా పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న స్వామి పరిపూర్ణానంద సరస్వతి, జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు



మేజిక్ డ్రైన్ నిర్మాణ పనులపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న చీఫ్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ గోపీచంద్

మేజిక్ డ్రైన్‌ల నిర్మాణంతో

భూగర్భ జలాలు పెంపొందుతాయి

- క్వాలిటీ కంట్రోల్ ముఖ్య అధికారి గోపీచంద్
- ఉపాధి సిబ్బందికి ఒకరోజు శిక్షణ

గోకవరం, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): మేజిక్ డ్రైన్‌ల నిర్మాణంవల్ల భూగర్భ జలాలు పెంపొందడంతోపాటు, గ్రామాలలో పారి శుధ్యం మెరుగుపడుతుందని చీఫ్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ గోపీచంద్ అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణా ఉపాధి హామీ పథకంలో భాగంగా మేజిక్ సోక్ చానల్ (మేజిక్ డ్రైన్) నిర్మాణపు పనులను చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ప్రతీ జిల్లాకు నాల్గు గ్రామ పంచాయతీలను ఎంపిక చేశారు. గోకవరం మండలంలోని అచ్చుతాపురం గ్రామ పంచాయతీని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. డ్వామా పీడీ ఎ.నాగమహేశ్వరరావు ఆధ్వర్యంలో తూర్పు, పశ్చిమ, ఏలూరు, కాకినాడ, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన ఉపాధి సిబ్బందికి బుధవారం అచ్చుతాపురం గ్రామంలో ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈశిక్షణా కార్యక్రమానికి చీఫ్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ గోపీచంద్ ముఖ్యఅతిథిగా హాజరై మేజిక్ డ్రైన్ నిర్మాణ సమయంలో తీసుకోవాల్సిన విధి విధానాలను సిబ్బందికి వివరించారు. అనంతరం గ్రామంలో నిర్మించనున్న మేజిక్ డ్రైన్ నిర్మాణపు పనులపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ బత్తుల వెంకటరామకృష్ణ, ఏపీడీ రామ్‌ప్రసాద్, ఎంపీడీవో గోవిందు, ఏపీవో అప్పలరాజుతో పాటు ఐదు జిల్లాల ఇం జనీరింగ్ అసిస్టెంట్లు, సాంకేతిక సహాయకులు, క్షేత్రసహాయకులు, పాల్గొన్నారు.

అలరించిన విఘ్నేశ్ ఈశ్వర్ గాత్ర కచేరీ



కచేరీ చేస్తున్న విఘ్నేశ్ ఈశ్వర్

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సరస్వతి గానసభ 122వ దసరా సంగీత, నృత్య, నాటకోత్సవాలు మంగళవారం మూడో రోజుకు చేరుకున్నాయి. నగరంలోని సూర్యకళా మందిరంలో విఘ్నేశ్ ఈశ్వర్ గాత్ర కచేరీ అలరించింది. శ్రీరాగంలో త్యాగరాజస్వామి పంచరత్న కీర్తన ఎందరో మహానుభావులతో ప్రారంభించి... బేగడ రాగంలో శంకరి నీవే మొదలైన కృతులు గానం చేశారు. ఈశ్వర్‌కు గాయత్రి శివాని (చెన్నై) వయొలిన్‌పై, ప్రవీణ్ స్పార (చెన్నై) మృదంగంపై, సరస్వతుల హనుమంతరావు (బోడపాడు) ఘటంపై చక్కటి వాద్య సహకారం అందించారు. సరస్వతి గానసభ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో సంగీతప్రియులు కచేరీని తిలకించి ఆనందించారు.

ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించాలి

- నన్నయ వీసీ ప్రసన్నశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న నన్నయ వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వేదిక కావాలని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ కోరారు. క్రీడాకారులకు అవసరమైన వసతులు, వనరులు సమకూర్చి ప్రతిభను ప్రోత్సహించాలని సూచించారు. విశ్వవిద్యాలయంలో బుధవారం క్రీడాబోర్డు సమావేశం జరిగింది. దీనికి వీసీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ అఖిలభారత దేహదారుఢ్య ఛాంపియన్‌షిప్‌ను నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని అన్నారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని నన్నయ అనుబంధ కళాశాలల్లో ప్రతిభావంతులను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాలలోని క్రీడాకారుల ప్రతిభకు నన్నయ విశ్వవిద్యాలయం వేదిక కావాలన్నారు. అన్ని కళాశాలల్లో వ్యాయామ విద్య డైరెక్టర్లు ఉండాలని సూచించారు. అకడమిక్ కరిక్యూలమ్‌కు ఇబ్బంది లేకుండా క్రీడాపోటీలు నిర్వహించాలని చెప్పారు. నిబంధనలకు అనుగుణంగా ఆయా క్రీడాపోటీల నిర్వహణకు అవసరమై ప్రోత్సాహాన్ని సహకారాన్ని విశ్వవిద్యాలయం అందజేస్తుందని చెప్పారు. నన్నయ విశ్వవిద్యాలయం క్రీడలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుందన్నారు. దానిని సద్వినియోగం చేసుకోవాలని యువతను క్రీడలలో రాణించే విధంగా పీడీలు ప్రయత్నించాలని సూచించారు. తరువాత సుమారు 48 రకాల పురుష, మహిళా క్రీడాపోటీలు ఏపీ కళాశాలల్లో నిర్వహించాలనే అంశంపై సమావేశంలో చర్చించి నిర్ధారించారు. కేటాయించిన క్రీడాపోటీలను విజయవంతంగా నిర్వహించాలని, ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, పీడీలు క్రీడాపోటీలు నిర్వహించిన వెంటనే బిల్లులు సమర్పించాలని రిజిస్ట్రార్ ఆచార్య కె.వి.స్వామి సూచించారు. ఈ కార్యక్రమంలో క్రీడాబోర్డు సహాయ కార్యదర్శి ఎం.వి.వి.ఎస్.ఎన్.మూర్తి, కోఆర్డినేటర్ పి.విజయనిర్మల, కె.సుబ్బారావు, పి.ఉమామహేశ్వరీదేవి సి.ఇ ఎస్.లింగారెడ్డి, ఆంధ్రా యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్ సైన్స్ ఎన్.విజయమోహన్, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం బీవోఎస్ ఛైర్మన్ జి.సరాహసరోజిని, సాప్ డైరెక్టర్ పి.రవీంద్రనాథ్, ఫిజికల్ డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కేంద్ర కారాగారాన్ని సందర్శించిన

బోర్డ్ ఆఫ్ విజిటర్స్ బృందం



భోజనం రుచి చూస్తున్న కలెక్టర్ కీర్తి



సెంట్రల్ జైలులోని హాస్పటల్ వద్ద బోర్డ్ ఆఫ్ విజిటర్స్ బృందం

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): బోర్డ్ ఆఫ్ విజిటర్స్ బృందం బుధవారం సెంట్రల్ జైలును సందర్శించింది. ఖైదీలకు అందుతున్న సదుపాయాలు, పరిశుభ్రత, భద్రత, వైద్య సౌకర్యాలు, ఉపాధి కల్పన పరిశ్రమలు, నైపుణ్యశిక్షణ, వంటశాల, బారక్‌లను పరిశీలించింది. వివిధ అంశాలపై జైలు అధికారులతో బృందం సభ్యులు చర్చించారు. ఖైదీలు విడుదల తర్వాత సమాజంలో తిరిగి సమర్థవంతమైన పౌరులుగా మారడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఖైదీలు విడుదలైన తర్వాత ఉపాధికి ఇబ్బంది కలుగకుండా ఉండడానికి ఉపాధికల్పన కోర్సులను అందిస్తున్నామని బృందానికి జైలు సూపరింటెండెంట్ రాహుల్ వివరించారు. నైపుణ్య శిక్షణ కూడా ఇస్తున్నా మని చెప్పారు. విద్య, మెరుగైన ఆరోగ్య సేవలను అందిస్తున్నామన్నారు. న్యాయ విజ్ఞానం, న్యాయ సహాయం వంటి వాటిపై మరింత అవగాహన కల్పిస్తామని చెప్పారు. బృందంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, కలెక్టర్ కీర్తి చేకూరి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి, ఎస్పీ నరసింహ కిషోర్, జిల్లా ఉపాధి కల్పనా అధికారి హరిశ్చంద్రప్రసాద్, పరిశ్రమల అధికారి శ్రీవనిధర్ రామన్, వ్యవసాయ అధికారి మాధవరావు ఉన్నారు.

పీస్ ఐకాన్ అవార్డుల ప్రదానం

జేఎన్టీయూకే, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ శాంతి దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్లోబల్ పీస్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పీస్ ఐకాన్ అవార్డులను జేఎన్టీయూకేలోని వీసీ చాంబర్‌లో ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ బుధవారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రపంచ శాంతి కోసం కృషి చేయాలన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎ.రాజా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గీసాల శ్రీనివాస్, ఎం.సత్యనారాయణ, ఐజక్ న్యూటన్, నరేష్‌బాబు, శివ, బెన్నిబాబు, టి.సూర్యారావులకు అవార్డులను అందజేశారు.



వీసీ ప్రసాద్‌తో పీస్ ఐకాన్ అవార్డులు అందుకున్న ప్రముఖులు

ఆర్టీసీలో అప్రంటిస్‌షిప్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో అప్రంటిస్ షిప్ కోసం ఐటీఐ పాస్ అయిన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా ప్రజారవాణా అధికారి వైఎస్ఎన్ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఈనెల 25నుంచి అక్టోబరు 12వ తేదీలోపు తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్ ట్రేడుల్లో అప్రంటీస్‌షిప్ ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఆన్‌లైన్‌లో తమ పేర్లు రిజిస్టర్ చేసుకున్న అభ్యర్థులు వెరిఫికేషన్ నిమిత్తం తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో అక్టోబరు 14న విజయనగరం వీటీ అగ్రహారంలోని ఆర్టీసీ జోనల్‌స్టాఫ్ ట్రైనింగ్ కాలేజ్ వద్ద హాజరుకావాలని తెలిపారు. ఎవరికైనా ఎటువంటి సందేహాలుంటే కార్యాలయం పనివేళల్లో ఫోన్ నెం.08922-294906కు ఫోన్ చేయవచ్చని ఆయన పేర్కొన్నారు.

నాదస్వరం విద్యాంసుడు మణికంఠకుమార్‌కు నంది అవార్డు



రాజమహేంద్రవరంసిటీ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):రాజమహేంద్రవరానికి చెందిన నాదస్వరం విద్యాంసుడు తేనంగి మణికంఠకుమార్‌కు నంది పురస్కారం లభించింది. ఈమేరకు బుధవారం రాజమహేంద్రవరంలో అవార్డు గ్రహీత ఒక ప్రకటన విడుదల చేశారు. విజయవాడ లబ్బీపేటలో దేవదాయధర్మాదయశాఖ ఆధ్వర్యంలో శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరిగిన కార్యక్రమంలో నంది పురస్కారాన్ని సినీనటుడు శుభలేఖ సుధాకర్, నాదస్వరం విద్వాంసుడు వడ్డాది సత్యనారాయణల చేతుల మీదుగా అందుకున్నారు. ఈమేరకు మణికంఠకుమార్‌ను పలువురు సంగీత అభిమానులు, ప్రముఖులు అభినందించారు.

వచ్చేనెల 25న రెడ్‌క్రాస్ మేనేజ్‌మెంట్ ఎన్నికలు

- కలెక్టర్ కీర్తి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తూర్పు గోదావరి జిల్లా శాఖకు నూతన మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు అక్టోబరు 15న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహిస్తామని కలెక్టర్ డా.కీర్తి చేకూరి తెలిపారు. ఎన్నికల్లో పాల్గొనడానికి జిల్లా రెడ్‌క్రాస్ శాఖలో సభ్యత్వం కలిగిన పేట్రాన్, వైస్ పేట్రాన్, లైఫ్ మెంబర్స్, లైఫ్ అసోసియేట్ మెంబర్స్ తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె సూచించారు.

మనస్తాపంతో అన్నవరం దేవస్థానం ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

అన్నవరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం ఈవో సుబ్బారావు పేషీలో సీసీ-2గా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి బీఎస్ఎన్ రాజు మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం చేశాడు. మద్యం తాగి విధులకు హాజరవుతున్నట్టు ఫిర్యాదులు అందుతున్నాయని, జాగ్రత్తగా నడుచుకోవాలని ఈవో మంగళవారం తన కార్యాలయంలో ఇతర ఉద్యోగుల సమక్షంలో సుతిమెత్తగా హెచ్చరించడంతో అవమానంగా భావించి బాత్‌రూంలు క్లీనింగ్‌కు వినియోగించే హార్పిక్‌ను తాగి రాజు ఆత్మహత్యాయత్నం చేయడంతో హుటాహుటిన కాకినాడ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యం అనంతరం ఇంటికి తీసుకొచ్చారు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగానే ఉందని ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంటా విష్ణు తెలిపారు. దేవస్థానం చైర్మన్ రోహిత్ రాజును ఫోన్‌లో పరామర్శించారు. ఈవో సుబ్బారావు రాజు ఇంటికి వెళ్లి పరామర్శించారు.

బస్సు నుంచి జారి పడి మహిళ మృతి


మరణించిన నర్సమ్మ

అల్లవరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బస్సు నుంచి జారి పడి మహిళ మృతి చెందింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గోడిలంక వద్ద ఒడలరేవు నుంచి అమలాపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు నుంచి నారీగడ నర్సమ్మ(55) బుధవారం ప్రమాదవశాత్తు జారి పడి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించింది. మొగళ్లమూరు శివారు చిరగట్లకు చెందిన నర్సమ్మ మొగళ్లమూరులో బస్సు ఎక్కి జారి పడి మరణించిందని అల్లవరం ఎస్ఐ సంపత్ కుమార్ తెలిపారు. మృతురాలి సోదరుడు చంద్రరావు ఫిర్యాదుతో రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్ పర్యవేక్షణలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

తాళ్లరేవు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం సీతారామపురం గుడ్డివానితూము సెంటర్లో 216 జాతీయ రహదారిపై పెట్రోలు బంకు సెంటర్లో ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలైనట్టు కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ బుధవారం తెలిపారు. గాడిమొగ పంచాయతీ పెదవలసలకు చెందిన పాలెపు వీరబాబు, రేకాడి వీరబాబు ద్విచక్రవాహనంపై పెట్రోలు బంకు వద్ద రోడ్డు దాటుతుండగా రాజోలు నుంచి కాకినాడ వెళ్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. క్షతగాత్రులకు తాళ్లరేవు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో ప్రథమ చికిత్స చేసి అనంతరం అంబులెన్సులో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సోనా బోటు దగ్ధం


దగ్ధమవుతున్న బోటు

అల్లవరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడల రేవు వైనతేయి నదీ తీరాన కొప్పనాతి భవాని శంకర్‌కు చెందిన సోనా బోటు మంగళవారం అర్ధరాత్రి దగ్ధమైంది. బోటుకు వెల్డింగ్ చేసి వెల్డర్ వెళ్లిపోగా నిప్పురవ్వల కారణంగా దగ్ధమై రూ.15లక్షలు మేర ఆస్తి నష్టం వాటిల్లిందని శంకర్ పేర్కొన్నాడు.

హైవేపై ప్రమాదాల నివారణకు యాంటీ పార్కింగ్ లేజర్ సిస్టం

గండేపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ జాతీయ రహదారిపై ప్రమాదాలు నివారించేందుకు విజయవాడకు చెందిన కెవై సొల్యూషన్స్ ద్వారా ప్రత్యేక సాఫ్ట్‌వేర్ డెవలప్ చేయించి(యాంటీ పార్కింగ్ లేజర్ సిస్టం) ఏర్పాటు చేస్తున్నట్టు జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపారు. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం తాళ్ళూరు పరిధిలో ట్రయల్ రన్ చేశామన్నారు. ఈ పద్ధతి ద్వారా జాతీయ రహదారిపై వాహనాలు నిలుపుదల చేస్తే వెంటనే ఐదుగురు పోలీసు అధికారులకి సైరన్, ఎస్ఎంఎస్, ఫోన్ ద్వారా అలర్ట్ చేయడం జరుగుతుందన్నారు. జాతీయ రహదారిపై వాహనం తీసే వరకు సైరన్ మోగుతూనే ఉంటుందన్నారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ప్రత్యేకశ్రద్ధ పెట్టి దీన్ని ఏర్పాటు చేస్తున్నారని సీఐ పేర్కొన్నారు.

శాంతించిన మత్స్యకారులు

- ఉప్పాడలో ఆందోళన విరమణ
- వచ్చే నెల 10లోగా డిప్యూటీ సీఎం పవన్ ఉప్పాడ వస్తారని డీసీసీబీ చైర్మన్ హామీ
- రాకపోతే మళ్లీ ఆందోళన చేస్తామన్న మత్స్యకారులు


ఉప్పాడలో మత్స్యకారులతో మాట్లాడుతున్న కాకినాడ జిల్లా కలెక్టర్


కలెక్టర్ ఎదుట నినాదాలు చేస్తున్న మత్స్యకారులు

కొత్తపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతాల్లో నెలకొల్పిన రసాయన పరిశ్రమల వల్ల మత్స్య సంపద అంతరించిపోవడంతో తమ జీవనోపాధికి ఆటంకం కలుగుతుందని, నష్టపరిహారం చెల్లించాలని కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ బీచ్‌రోడ్డు సెంటర్లో మత్స్యకారులు చేపట్టిన ఆందోళనను బుధవారం సాయంత్రం తాత్కాలికంగా విరమించారు. డిప్యూటీ సీఎంతో అక్టోబరు 2నుంచి 10లోగా ఉప్పాడలో మత్స్యకారులతో సమావేశం ఏర్పాటు చేస్తామని డీసీసీబీ చైర్మన్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామ స్వామి ఇచ్చిన హామీ మేరకు తాత్కాలికంగా ఆందోళన విరమించామని మత్స్యకార నాయకులు సూరాడ రాజు, ఉమ్మిడి జాన్, నక్కా మణిం కంఠ తెలిపారు. తుమ్మల, జిల్లా కలెక్టర్ ఇచ్చిన హామీ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. వచ్చేనెల 10లోగా డిప్యూటీ సీఎం పవన్ ఉప్పాడ రాకపోతే మళ్లీ ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.

కలెక్టర్ వద్దకు గుంపులుగా...

ఇదిలా ఉండగా బుధవారం ఉదయం డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మత్స్యకారుల ఆందోళన దగ్గరకు వచ్చారు. డిప్యూటీ సీఎం పేర్కొన్న పాయింట్లను కలెక్టర్ మత్స్య కారుల వద్ద ప్రస్తావించి, వేటకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. దీంతో సహనం కోల్పోయిన మత్స్యకారులతో పాటు మహిళలు మీరు తెలియజేసిన వివరాలను హామీలను నేరుగా పవన్‌కల్యాణే ఉప్పాడ వచ్చి తమకు స్పష్టమైనహామీ ఇచ్చే వరకు ఎన్నిరోజులైనా రోడ్డుమీదే పడి ఉంటామని కలెక్టర్‌కు తెలిపారు. ఒకానొకదశలో మత్స్యకార మహిళలు ఆందోళన చేస్తున్న ప్రాంతం నుంచి కలెక్టర్ వద్దకు గుంపులుగా వెళ్లేందుకు ప్రయత్నించారు. పరిస్థితిని గమనించిన అడిషనల్ ఎస్పీ, కాకినాడ డీఎస్పీ మణీష్ దేవరాజ్, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ జి.వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసులు కలెక్టర్‌ను ఆందోళనచేసే ప్రాంతం నుంచి బయటకు తీసుకెళ్లారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరిస్తా

అసెంబ్లీ సమావేశాలు ముగిశాక ఉప్పాడ వస్తా : డిప్యూటీ సీఎం పవన్

కొత్తపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారుల సమస్యలన్నీ తన దృష్టిలో ఉన్నాయని, వాటి పరిష్కారానికి ఉన్నతాధికారులు, మత్స్యకారప్రతినిధులు, స్థానిక నాయకులతో కమిటీ ఏర్పాటు చేస్తామని పిఠాపురం ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు. కాలుష్య పరిశ్రమల వల్ల మత్స్యకారుల జీవనోపాధికి నష్టంవాటిల్లుతుందని 2 రోజులుగా చేస్తున్న ఆందోళనపై ఆయన స్పందించి బుధవారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. తీరప్రాంతాల్లో నెలకొల్పిన ఫార్మా పరిశ్రమల ప్రభావం వల్ల మత్స్యకారుల జీవనోపాధిపై ఏర్పడుతున్న ప్రభావం, ఉప్పాడ మత్స్యకారులు వ్యక్తపరిచిన ఆందోళనలు, సమస్యలు తన దృష్టిలో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల కారణంగా మత్స్యకార కుటుంబాలు ఎదుర్కొంటున్న కష్టాలు ఏ విధంగా ఉన్నాయో అర్థం చేసుకోగలనన్నారు. ప్రస్తుతం శాసనసభ సమావేశాల కారణంగా వ్యక్తిగతంగా వచ్చి మత్స్యకారులతో చర్చించలేకపోతున్నాను. సమస్యల పరిష్కారానికి గత 2 రోజుల నుంచీ రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులతో చర్చిస్తున్నానన్నారు. మత్స్యకారులు ప్రస్తావించిన ప్రతీ సమస్యను పరిగణనలోకి తీసుకుని పరిష్కార మార్గాలు అన్వేషించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణ మండలి, పరిశ్రమలు, ఫిషరీస్, రెవెన్యూ ఉన్నతాధికారులు, కాకినాడ జిల్లా కలెక్టర్‌తో కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. ఆయా కమిటీల్లో మత్స్యకార ప్రతినిధులు, స్థానిక నాయకులకు స్థానం ఇవ్వాలని నిర్ణయించామన్నారు. సమస్యల పరిష్కారంతో పాటు జీవనోపాధి మెరుగుదల, తీరప్రాంత గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపైన ఈ కమిటీ దృష్టి పెడుతుందన్నారు. నష్టపరిహారం మదింపుపై ఈ కమిటీ చర్చిస్తుందని, ఆయా నివేదిక ఆధారంగా సీఎం చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొంటుందని పవన్ పేర్కొన్నారు. ఇప్పటికే వీలైనంత త్వరగా పరిష్కరించాల్సిన సమస్యలను గుర్తించామన్నారు. మరణించిన 18 మంది మత్స్యకారులకు సంబంధించిన కుటుంబాలకు చెల్లించాల్సిన బీమా మొత్తం చెల్లింపు, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్ దగ్గర దెబ్బతిన్న పడవలకు నష్టపరిహారం చెల్లింపు అంశాలపై అధికారులతో చర్చించినట్టు తెలిపారు. దానిపై తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించినట్టు పేర్కొన్నారు. మచిలీపట్నం, అంతర్వేది తదితర ప్రాంతాల్లో మత్స్యకారులకు వేటకు వెళ్లేందుకు అవకాశం ఇవ్వడంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేసినట్టు తెలిపారు. ఆ అంశాలపై కమిటీ నివేదిక కోసం ఎదురు చూడకకుండా ప్రాధాన్యంతో పరిష్కరించాలని తెలిపానన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం కష్టజీవులకు భరోసా కల్పిస్తుందన్నారు. ఈ క్రమంలోనే ఉప్పాడ మత్స్యకారుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లనున్నట్టు పేర్కొన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత స్వయంగా ఉప్పాడ వచ్చి మత్స్యకారులతో కూర్చొని అన్ని సమస్యలను సమగ్రంగా చర్చిస్తానని పవన్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

గంజాయితో ఐదుగురి అరెస్ట్

రూ.45 లక్షల విలువైన 900 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడ్డ నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

అడ్డతీగల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణాకు పాల్పడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.45 లక్షల విలువైన 900 కిలోల గంజాయిని రాజవొమ్మంగి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణా జరుగుతుందని సమాచారం అందడంతో అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ భర్దర్ ఆదేశాల మేరకు రంపచోడవరం డీఎస్పీ సాయిప్రశాంత్ ఆధ్వర్యంలో రాజవొమ్మంగి సీఐ ఎస్.గౌరిశంకర్ పర్యవేక్షణలో ఎస్ఐ డి.వెంకటేష్, సిబ్బంది మంగళవారం గంగవరం శివారు నెమల్లి చెట్టు సెంటర్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఎండపల్లి వైపు నుంచి వస్తున్న స్కార్పియో, మోటార్‌సైకిల్, మినీవ్యాన్‌లో ప్రయాణిస్తున్న ఐదుగురు వ్యక్తులు పారిపోవడానికి ప్రయత్నిస్తుండగా పట్టుకుని వాహనాలను తనిఖీ చేయగా ఆశోక్‌లీల్యాండ్ బడాదోస్త్ వాహనంలో 900 కిలోల గంజాయి పట్టుపడినట్టు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. గంజాయి విలువ రూ.45 లక్షలు ఉంటుందన్నారు. ఒరిస్సా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా కామ్‌వాడ గ్రామానికి చెందిన పరేష్ బిస్వాస్, న్యూటెక్‌పడార్ రాలేగడా గ్రామానికి చెందిన రబీంద్ర కరా, కమ్‌వాడా గ్రామానికి చెందిన సకాంత్‌రే, ఏఎస్ఆర్ జిల్లా దారకొండ గ్రామానికి చెందిన ముర్ల లక్ష్మణరావు, తూర్పు గోదావరి జిల్లా గోకవరం గ్రామానికి చెందిన నక్కా శివప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు. వారి నుంచి మహింద్రా స్కార్పియో, ఆశోక్‌లీల్యాండ్ బడాదోస్త్, ఎవేంజర్ బజాజ్ మోటారుసైకిల్, 5 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులు గ్రూపుగా ఏర్పడి ఒరిస్సా రాష్ట్రంలోని మల్కన్‌గిరి, చిత్ర కొంద డివిజన్ పరిసర గ్రామాల్లో గంజాయికొని రాజమహేంద్రవరం, విజయవాడ, చెన్నై, మహారాష్ట్ర ప్రాంతాలకు తరలించేందుకు ప్రయత్నిస్తుండగా పట్టుపడినట్టు ఎస్ఐ తెలిపారు. పరేష్ బిస్వాస్‌పై ఇప్పటికే 2 ఎన్‌డీపీఎస్ కేసులు ఉన్నాయని, గతంలో 920 కిలోల గంజాయి రవాణాలో కేసులో పరారీలో ఉన్నట్టు చెప్పారు. దాడుల్లో ఏఎస్ఐ సీహెచ్ వివి మహర్షి, హెడ్‌కానిస్టేబుల్ కె.రాంబాబు, పోలీసులు సీహెచ్.ఆశోక్, కె.సాయినాద్, సీహెచ్ వీరబాబు, కొండబాబులు ఉన్నారు. నిందితులను పట్టుకున్నవారిని ఎస్పీ అభినందించారు.

దివిలి కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల మధ్య కొట్లాట


విద్యార్థి తల, చెవి భాగంలో గాయాలు

పెద్దాపురం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం దివిలి కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు బుధవారం కళాశాల బయట కొట్లాటకు దిగారు. సీనియర్, జూనియర్స్ మధ్య ఘర్షణ జరిగింది. కళాశాలలో విద్యార్థుల మధ్య లోకల్, నాన్ లోకల్ ప్రస్తావన రావడంతో ఇరువర్గాల మధ్య మాట మాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఈ విషయాన్ని సెల్‌ఫోన్‌లో చిత్రీకరించడంతో గొడవ మరింత పెద్దదయింది. ఈ ఘటనలో ఫైనల్ ఇయర్ విద్యార్థి షేక్ సుభానిపై జూనియర్స్ కొంతమంది బయట వ్యక్తులతో కలిసి బీర్ బాటిల్‌తో దాడి చేశారు. దీంతో సుభాని తలపై గాయమైంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్టు ఎస్ఐ మౌనిక తెలిపారు.

బీరు బాటిల్‌తో దాడి

కొడవలి సర్పంచ్‌కు గాయాలు


గాయపడిన సర్పంచ్

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బీరు బాటిల్‌తో దాడి ఘటనలో కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం కొడవలి సర్పంచ్‌కు గాయాలయ్యాయి. కొడవలి సర్పంచ్ బుర్రా రామచంద్ర (గొల్లబాబు) బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఉన్నారు. అక్కడకు వచ్చిన గ్రామానికి చెందిన తాటిపర్తి అప్పారావు బీరు బాటిల్‌తో దాడి చేశాడు. దీంతో పలు చోట్ల గాయాలయ్యాయి. సర్పంచ్ ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు.

విశ్వనాథ వీరంగం!

- ఇంద్రకీలాద్రిపై తలుపులమ్మ ఆలయ ఈవో ఓవరాక్షన్
- కానిస్టేబుల్ పట్ల అవమానకర ప్రవర్తన
- వీఐపీ క్యూ వద్ద ఆపి మెడలో ఉన్న పాస్ తెంపేసిన వైనం


కానిస్టేబుల్ గురువులు మెడలో పాస్‌ను లాగేస్తున్న విశ్వనాథరాజు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

కాకినాడ జిల్లా తలుపులమ్మ దేవస్థానం ఈవో విశ్వనాథరాజు ఇంద్రకీలాద్రిపై వీరంగం చేశారు. దేవస్థానంలో మొత్తం పెత్తనం తనదే అన్నట్టుగా వ్యవహరించారు. వీఐపీ క్యూ మార్గంలో పోలీసు కానిస్టేబుల్ పట్ల దుర్మార్గంగా ప్రవర్తించారు. ఆయనను భక్తులు, తోటి ఉద్యోగుల ముందు అవమానపరిచేలా నడుచుకున్నారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ గురువులు ఇంద్రకీలాద్రిపై ఇంతకుముందు పోలీసు శాఖ తరఫున ప్రొటోకాల్ వ్యవహారాలు చూసేవారు. ఆయన శరన్నవరాత్రుల ఆరంభం నుంచి విధుల్లో ఉన్నారు. దీనికి సంబంధించి అధికారులు గురువులుకు డ్యూటీ పాస్‌ను జారీ చేశారు. విధి నిర్వహణలో భాగంగా గురువులు వీఐపీ క్యూ వద్ద నుంచి రాజగోపురం వైపునకు వెళ్తున్నారు. అక్కడే ఉన్న విశ్వనాథరాజు ఆయనను క్యూలైన్ వద్ద ఉన్న గేటు దగ్గర ఆపారు. తాను పోలీసు కానిస్టేబుల్‌నని గురువులు చెప్పారు. మెడలో వేసుకున్న డ్యూటీపాస్‌ను విశ్వనాథరాజుకు చూపించారు. పాస్‌ను చేతితో పట్టుకుని అందులో ఉన్న ఫొటోను చూపిస్తూ ఇది నువ్వా... ఇది నువ్వా అంటూ రెట్టించి దురుసుగా మాట్లాడారు. మెడలో ఉన్న పాస్‌ను తెంచేశారు. దీనితో గురువులు జేబులో ఉన్న పోలీసు శాఖ గుర్తింపుకార్డును చూపించారు. దాన్ని చూసి చిత్కారంగా విశ్వనాథరాజు మాట్లాడారు. ఎలాంటి తప్పు లేకపోయినా గురువులపై విశ్వనాథరాజు వీరంగం చేస్తుండడంతో చుట్టుపక్కల ఉన్న అధికారులు, మీడియా ప్రతినిధులు ఆయనను నిలదీశారు. ఇదేం పద్ధతిఅని ప్రశ్నిస్తుండగా సమాధానం చెప్పకుండా విశ్వనాథరాజు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఒక దేవస్థానానికి ఈవో హోదాలో ఉన్న అధికారి ఇలా ప్రవర్తించడంపై క్యూల్లో ఉన్న భక్తులు విస్తుపోయారు. ఈవో ప్రవర్తనకు గురువులు చాలా ఇబ్బందిపడ్డారు.

సంతోషంగా చలో..

- డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులు విజయవాడకు పయనం
- రాజమహేంద్రవరంలో ఏర్పాట్లు



సత్యసాయి గురుకులంలో మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ..


బీవీఎం హైస్కూల్లో ఆనందం వ్యక్తం చేస్తూ..


లాలాచెరువు హైస్కూల్ విశ్రాంతి గదిలో అభ్యర్థులు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025లో ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థుల విజయవాడ ప్రయాణానికి ఏర్పాట్లు పూర్తి చేశామని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ డా.కీర్తి చేకూరి తెలిపారు. రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న నియామక పత్రాల జారీ కార్యక్రమానికి ఉమ్మడి తూర్పు గోదావరి నుంచి ఉపాధ్యాయ అభ్యర్థి, ఒక సహాయకుడు/సహాయకురాలితో బుధవారం సాయంత్రం రాజమహేంద్రవరంలో ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన బస కేంద్రాల వద్ద రిజిస్ట్రేషనుకు హాజరుకావడం జరిగిందన్నారు. రాత్రి వసతి, భోజనం, గురువారం ఉదయం టిఫిన్ ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి బస్సుకు ఒక పర్యవేక్షకుడిని నియమించామన్నారు. అభ్యర్థులకు ఇబ్బంది కలగకుండా జిల్లా నోడల్ అధికారులు శ్రద్ధ తీసుకోవాలని ఆమె ఆదేశించారు. ఆయా పాఠశాలలను కలెక్టర్ సందర్శించి వసతి ఏర్పాట్లను పరిశీలించారు. ఉపాధ్యాయ అభ్యర్థులతో ముచ్చటించారు.



కొత్త టీచర్లతో ముచ్చటిస్తున్న తూర్పుగోదావరి కలెక్టర్ కీర్తి, సత్యసాయి గురుకులంలో మహిళా అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన

ప్రత్తిపాడు నగల దుకాణంలో చోరీ

షట్టర్ పగల కొట్టి 11 కిలోల వెండి ఆభరణాలు అపహరణ


ప్రత్తిపాడులో చోరీ జరిగిన నగల దుకాణం


దుకాణంలో క్లూస్ టీం తనిఖీలు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడులోని ఒక నగల దుకాణంలో దుండగలు 11కిలోల వెండి వస్తువులు చోరీ చేశారు. బుధవారం వేకువజామున 2 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. పోలీసులు, స్థానికులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రత్తిపాడు అల్లూరి సీతారామరాజుసెంటర్ సమీపంలో టీడీపీ నాయకుడు గొంతిన సురేష్‌కు చెందిన సురేష్‌జ్యూయలర్స్ అండ్ బ్యాంకర్స్ దుకాణంలో చోరీ జరిగింది. సీసీ కెమెరాలలో బుధవారం వేకువ జామున 2గంటలు తరువాత నలుగురు దుండగులు షాపులోకి చొరబడగా మరో ఇద్దరు ముసుగులు ధరించి షాపునకు కొంచెందూరంలో కాపలాగ ఉన్నారు. షట్టర్ పగల కొట్టి నగల దుకాణంలో ఉన్న రూ.2లక్షలు విలువ చేసే 11కిలోల వెండి ఆభరణాలు దోచుకున్నారు. దుకాణంలోని లా కర్‌ను తెరిచేందుకు దుండగలు విశ్వప్రయత్నాలు చేశారు. కానీ తెరుచుకోకపోవడంతో దొరికిన వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఈ వ్యవహారం అంతా సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, ప్రత్తిపాడు సీఐ బి.సూర్యఅప్పారావు, ఎస్ఐ లక్ష్మీకాంతం, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సంఘటనా స్థలానికి తరలివచ్చి క్షుణ్ణంగా పరిశీలించారు. ఎస్ఐ లక్ష్మీకాంతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐటీడీఏలకు పునరుజ్జీవం కల్పించండి

అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరిన రంప ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల సర్వతోముఖాభివృద్ధి కోసం నడిచే ఐటీడీఏలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, వాటికి పునరుజ్జీవం కల్పించి గిరిజనాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం అసెంబ్లీలో జీరో అవర్ ప్రశ్నోత్తరాల సమయంలో ఐటీడీఏల పనితీరుపై ఆమె మాట్లాడారు. సొసైటీల చట్టం ప్రకారం ఏర్పాటైన ఐటీడీఏల్లో నిబంధనల ప్రకారం నాలుగేళ్లుగా సమావేశాలు జరగని దుస్థితి నెలకొందని, ఇక్కడ ఏం జరుగుతోందో కూడా తెలయని పరిస్థితి నెలకొందన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి సాధారణ సమావేశం, ఏటా వార్షిక సమావేశాలను నిర్వహించాల్సి ఉండగా రంపచోడవరం ఐటీడీఏలో నాలు గేళ్లుగా సమావేశాలే లేవని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ అనాలోచిత జిల్లాల పునర్విభజన కారణంగా రంపచోడవరం, చింతూరు, పాడేరు, సీతంపేట, పార్వతీపురం, కె.ఆర్.పురం ఐటీడీఏలకు చైర్మన్‌లు ఎవరో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. జిల్లాల పునర్విభజన మేరకు కొత్త జిల్లాల కలెక్టర్లను చైర్మన్లుగా చేస్తూ ఎటువంటి సవరణలను ఇటు ఐటీడీఏలు కానీ, అటు ప్రభుత్వం కానీ చర్యలు చేపట్టలేదన్నారు. ముఖ్యంగా ఐటీడీఏల్లోని అధికారులు, సిబ్బంది ఏళ్ల తరబడి పాతుకుపోయారని ఆమె తెలిపారు. ఐటీడీఏల్లో గత ఆరు సంవత్సరాలుగా నిర్వహించిన ఆడిట్ రిపోర్టులను అందచేయాలని కోరారు. ముఖ్యంగా ఐటీడీఏలు సొసైటీల చట్టంప్రకారం ఏర్పాటు అయినప్పటికీ వాటిని ఎప్పటికప్పుడు రెన్యువల్ చేయాల్సిన అంశాన్ని కూడా అధికారులు విస్మరించి ఐటీడీఏలకు చట్టబద్ధత లేకుండా చేస్తున్నారన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని బుధవారం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి కలిశారు. అడ్డతీగల-ఏలేశ్వరం రహదారి, మడేరు వాగుపై ఆనకట్ట నిర్మించాలని, రంపచోడవరం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలని, చిరుద్యోగులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని వినతిపత్రం అందజేశారు.



కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

రామాయణం పెయింటింగ్స్ ప్రదర్శన

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ కాకినాడ స్టార్స్ అధ్యక్షుడు ప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో బుధవారం బోట్ క్లబ్ పార్కులో ఏర్పాటుచేసిన రామాయణం పెయింటింగ్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. వీటిని తిలకించేందుకు పెద్ద ఎత్తున సందర్శకులు తరలివచ్చారు. వాకర్స్ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాదరావు, కృష్ణంరాజు, శ్రీరామరాజు, సుబ్బారావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


సిల్వర్ జూబ్లీ వేడుకలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావును సత్కరిస్తున్న దృశ్యం

‘దేవాలయాల కంటే పవిత్రమైనవి విద్యాలయాలు’

కాజులూరు (కరప), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చదువును బోధించే విద్యాలయాలు దేవాలయాల కంటే అతి పవిత్రమైనవని మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం అన్నారు. కాజులూరు మండలం కుయ్యేరు హైస్కూల్లో బుధవారం జరిగిన సిల్వర్ జూబ్లీ వేడుకలకు వారు ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. పూర్వ, ప్రస్తుత విద్యార్థులు, ఉపాధ్యాయులు, దాతలు, గ్రామస్తులు హైస్కూలు పురోభివృద్ధికి ఎంతో పాటుపడ్డారని ప్రశంసించారు. హైస్కూలు నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషించిన వీరరాఘవయ్య, కరణం, మాగాపు రాంబాబు, ప్రసాద్‌రావు కృషి స్ఫూర్తిదాయకమన్నారు. అభివృద్ధికి పాటుపడిన కుయ్యేరు మునసబు, స్థానిక ఉపాధ్యాయులు సాయి, సుబ్రహ్మణ్యం, రామస్వామి, త్రిమూర్తులు, శ్రీరామచంద్రబాబాయి, మూర్తి, సత్తిరాజు, గంగాధర్‌లను గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. కూటమి నాయకులు డాక్టర్ బాబు, ఉంగరాల వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది, పూర్వ, ప్రస్తుత విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలుపుతున్న మాజీ మేయర్ పావని, తెలుగు మహిళలు

తిరుమల పరకామణిలో దోపిడీపై నిరసన

కాకినాడ సిటీ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామికి భక్తులు కానుకగా సమర్పించిన డబ్బును గత వైసీపీ ప్రభుత్వ పాలనలో దోచుకోవడం మహాపాపమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ మేయర్ సుంకర పావని పేర్కొన్నారు. వైసీపీ పాలనలో టీటీడీ పరకామణిలో దొంగతనానికి పాల్పడిన రవికుమార్‌తో పాటు అతని వెనుక వున్న సూత్రధారులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం ఈ మేరకు పావని ఆధ్వర్యంలో తెలుగు మహిళలు బ్యానర్, ప్ల కార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. దేవుని పరకామణిలో డబ్బులు దొంగతనం మహాపాపం అని ముద్రించిన పోస్టర్లను పలు సెంటర్లలో గోడలకు అతికించారు.

‘మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి’


గొడ్డటిపాలెంలో రోగులను పరీక్షిస్తున్న సిబ్బంది. చిత్రంలో సర్పంచ్ అనుషఆంజనేయులు

కరప, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళలు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని గొడ్డటిపాలెం సర్పంచ్ గోన అనూషఆంజనేయులు సూచించారు. పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్ వైద్య శిబిరంలో ఆమె మాట్లాడారు. అనంతరం వైద్య, ఆరోగ్య సిబ్బంది పలువురికి పలు రకాల వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కరప పీహెచ్‌సీ, కాకినాడ జీజీహెచ్ వైద్యాధికారిణులు అఫ్రోజ్, సుస్మితరావు, పంచాయతీ కార్యదర్శి త్రిపురశంకర్, నాయకులు బోగిరెడ్డి గంగాధర్, గోన అంజి, నక్కా బ్రహ్మాజీ, కడియాల సత్యనారాయణ, గంజా రాంబాబు, చోడాబత్తుల మణికంఠ తదితరులు శిబిరానికి హాజరైన వారికి వైద్య సేవలు అందించారు.

వీధి విక్రయదారులకు ‘లోక్ కల్యాణ్ మేళాలు’


సామర్లకోటలో జరిగిన మేళాలో మాట్లాడుతున్న మెప్మా పీడీ ప్రియంవద

సామర్లకోట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వీధి విక్రయదారుల ఆర్థిక స్థితిగతులు పెంపొందించేందుకు ప్రభుత్వం లోక్ కల్యాణ్ మేళాలు నిర్వహిస్తోందని మెప్మా పీడీ ప్రియంవద పేర్కొన్నారు. సామర్లకోటలోని మెప్మా కార్యాలయంలో మున్సిపల్ కమిషనరు శ్రీవిద్య ఆధ్వర్యంలో బుధవారం లోక్ కల్యాణ్ మేళా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రియంవద మాట్లాడుతూ వీటిని వచ్చేనెల రెండో తేదీ వరకు అన్ని పట్టణాల్లో నిర్వహిస్తామని తెలిపారు. వీధి వ్యాపారస్తులకు మొదటి విడతగా రూ.15వేలు, రెండో విడతగా రూ.25 వేలు, మూడవ విడతగా రూ.50వేల చొప్పున రుణాలు ఇస్తామన్నారు. డిజిటల్ ట్రాన్సాక్షన్, ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎంలతో ప్రతినెలా క్యాష్‌బ్యాక్ వస్తుందన్నారు. కమిషనరు శ్రీవిద్య మాట్లాడుతూ వీధి వ్యాపారస్తులు ఆరోగ్యకరమైన పద్ధతుల్లో శుచి, రుచి, నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలను విక్రయించాలని కోరారు. ఎస్‌బీఐ మేనేజరు సీతారామయ్య, పోస్టల్ మేనేజరు రాజ్‌కుమార్, శానిటరీ ఇన్ స్పెక్టర్ రాజశేఖర్, రవిశంకర్, డీజీ లక్ష్మి, మెప్మా సీఆర్పీలు పాల్గొన్నారు.

‘ఖాతాదారులకు మెరుగైన సేవలే కేసీబీఎస్ లక్ష్యం’


జ్యోతిప్రజ్వలన చేస్తున్న అధ్యక్షుడు కోసూరి, డైరెక్టర్లు

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సహకార రంగంలో ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తున్న కేసీబీఎస్ ప్రగతిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ది కాకినాడ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. సూర్యకళా మందిరం ఆవరణలోని కేవీఆర్‌కే రావు హాలులో కేసీబీఎస్ సర్వసభ్య సమావేశాన్ని అధ్యక్షుడు కోసూరితో పాటు డైరెక్టర్లు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. కోసూరి మాట్లాడుతూ అతి తక్కువ కాలంలోనే ఖాతాదారుల మన్ననలు చూరగొని ఉన్నత స్థాయికి ఎదిగిందన్నారు. ఉపాధ్యక్షుడు రెడ్డి వీరరాజేంద్రకుమార్ మాట్లాడుతూ ఉద్యోగులు మరింత అంకితభావంతో పనిచేసి సంస్థ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. మేనేజరు టి.నగేష్ స్వాగత ఉపన్యాసం చేసి అతిథులను వేదికపై ఆహ్వానించారు. సభ్యుల సందేహాలను నివృత్తి చేశారు. కేసీబీఎస్ కార్యదర్శి ముమ్మిడి గోవిందు, డైరెక్టర్లు ముత్తా మధు, ఒబిలిశెట్టి బుచ్చిరాజు, శివబాలయోగి, కోసూరి లక్ష్మీప్రసాద లావణ్య, ఉద్యోగులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

జయలక్ష్మి సొసైటీలో రెండు డైరెక్టర్ పదవుల భర్తీకి

నోటిఫికేషన్ విడుదల

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ది జయలక్ష్మి కో-ఆపరేటివ్ సొసైటీలో ఖాళీగా ఉన్న రెండు డైరెక్టర్ పోస్టుల భర్తీకి బుధవారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినట్టు ఎన్నికల అధికారి కంబాల శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నిర్వహణకు ఈ నెల 12న షెడ్యూలు విడుదల చేసి ప్రాథమి ఓటర్ల జాబితా ప్రకటించామన్నారు. అభ్యంతరాలు, క్లెయిమ్‌లు ఉంటే 19న స్వీకరించామన్నారు. డైరెక్టర్ పదవులకు అక్టోబరు 5న కాకినాడ మున్సిపల్ బాలికల హైస్కూలు, పేర్రాజుపేటల్లో పోలింగ్ జరుగుతుందన్నారు. శుక్రవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సర్పవరం జంక్షన్‌లో గల జయలక్ష్మి సొసైటీ సెంట్రల్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తామని చెప్పారు. ఇతర వివరాలకు సొసైటీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.


కాకినాడ సూర్యారావుపేటలో బాలాత్రిపురసుందరి అమ్మవారిని దర్శించుకుంటున్న ఆర్డీవో మల్లిబాబు దంపతులు


గొల్లప్రోలులో మహిళలతో కలిసి బోనాలు ఎత్తుకున్న పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ

అన్నపూర్ణాదేవికి నీరాజనం

పిఠాపురం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్ర శత చండీ యాగ మహోత్సవాల్లో మూడో రోజైన బుధవారం పాదగయలో రాజరాజేశ్వరీదేవి అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పురుహూతికా అమ్మవారికి శ్రీచక్ర నవావరణార్చన సహిత సహస్ర పుష్పార్చన అనంతరం శ్రీచక్ర లక్ష కుంకుమార్చన నిర్వహించారు. ఈవో, సహాయ కమిషనరు కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. శృంగేరీ శంకర మఠం నిర్వహణలో పెద్ద బజారులో కొలువైయున్న మహాలక్ష్మి అమ్మవారు మహేశ్వరి అలంకారంలో దర్శనమిచ్చారు. హోమం, పూజలను ఆలయ నిర్వాహకుడు ఇంద్రగంటి వెంకట గోపాలకృష్ణ తదితరులు జరిపించారు.

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): తాటిపర్తిలో అపర్ణాదేవిని రక్షా పవిత్రాలతో చంద్రఘంటా దేవిగా అలంకరించారు. అమ్మవారికి కుంకుమ పూజలు, ప్రత్యేక అర్చనలను వేద పండితుడు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ఆలయ ప్రధానార్చకుడు ఆకొండి ప్రభాకరశాస్త్రి జరిపించారు. శివాలయంలో లలితాదేవికి చిద్రూపి పరదేవత అలంకారం చేశారు. అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు పూజలు చేశారు.

సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి): రమణయ్యపేటలోని శ్రీపీఠంలో ఐశ్వర్యాంబిక అమ్మవారికి రాజమాతంగి దేవిగా విశేషాలంకరణ చేశారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ రాజమాతంగి హోమం, దేవీ సూక్త హోమంలను పలు రకాల విశేష ద్రవ్యాలతో నిర్వహించారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): స్థానిక వరుధుల వారి వీధిలోని భువనేశ్వరి పీఠంలో అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పీఠాధిపతి చింతా గోపీశర్మ ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్దాపురం మరిడమ్మ, కాండ్రకోట నూకాలమ్మ అమ్మవార్లు గాయత్రీదేవిగా భక్తులకు అభయమిచ్చారు. ఈవోలు కె.విజయలక్ష్మి, ఎం.రాంబాబురెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కాకినాడ సిటీ (ఆంధ్రజ్యోతి): నగరంలోని సూర్యారావుపేటలో శ్రీబాలాత్రిపురసుందరి అమ్మవారిని కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు దంపతులు బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జీ, ఈవో వుండవల్లి వీర్రాజు చౌదరి స్వాగతం పలికి దర్శనం చేయించారు. అనంతరం పండితులు వేద ఆశీర్వచనం అందించి ప్రసాదాలు అందజేశారు. ఆలయం వద్ద దేవదాయ శాఖ ఆర్జేసీ వేండ్ర త్రినాథరావును ఉత్సవ కమిటీ సభ్యురాలు నల్లూరి తులసిశ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని మరగిరి గ్రామంలో బాలకనకదుర్గ అమ్మవారు గాయత్రీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పసుపు, కుంకుమ, గాజులతో భక్తులు అమ్మవారికి పూజలు చేశారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులోని బస్టాండు, దేవీనగర్, ఈబీసీ కాలనీ, కరణంగారి తోట, కొత్తపేట, మార్కండేయ తదితర ప్రాంతాల్లోని అమ్మవార్ల ఆలయాలు, మండపాల్లో కుంకుమ, విశేష పూజలు జరిగాయి. కరణంగారితోటలోని కనకదుర్గమ్మ అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు బోనాలు ఎత్తుకుని ఆలయానికి ప్రదర్శనగా తీసుకువచ్చారు. 18, 19, 20 వార్డుల్లోగని చెల్లి విజయదశమి నవరాత్రుల్లో భాగంగా జరిగిన బోనాల పండుగలో మహిళలతో కలిసి పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ బోనాలు ఎత్తుకున్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో బాలాత్రిపురసుందరి అమ్మవారికి ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, చెరుకూరి సుందరరామయ్య (రాంబాబు), ఆకెళ్ళ రాజగోపాలశర్మ, కొంతేటి భీమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకటరమణ వేదమంత్రోచ్చారణలతో విశేష పుష్పార్చన, కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారిని గాయత్రీదేవిగా సర్వాంగసుందరంగా అలంకరించారు. తొలుత భీమేశ్వరస్వామిని పంచద్రవ్యాలతో అభిషేకించి నూతన పట్టువస్త్రాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. కంచి మహా సంస్థానంలో స్వయంవర పార్వతి అమ్మవారికి చంద్రాభట్ల పతంజలి-పద్మ దంపతులు విశేష పూజలు జరిపారు. వేట్లపాలెంలోని భేతాళస్వామి ఆలయంలో కమిటీ ప్రతినిధులు కొండపల్లి జగ్గారావు, కొండపల్లి కృష్ణమూర్తి, గుణ్ణం సూర్యారావు ఆధ్వర్యంలో పూజలు చేశారు. గ్రామ మహిళా భక్త కమిటీ సభ్యులు లలితాసహస్రనామ పారాయణ గావించి భజన చేశారు.


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

‘పని గంటల పెంపు తీర్మానాన్ని రద్దు చేయాలి’

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పని గంటలను పెంచుతూ కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని తక్షణం రద్దు చేయాలని, మహిళలతో రాత్రివేళల్లో పని చేయించడం మానుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ మాట్లాడుతూ మూడు షిఫ్టులు రెండు షిఫ్టులుగా మారడంతో ప్రతి ముగ్గురిలో ఒకరు ఉపాధి కోల్పోతున్నారన్నారు. సుదీర్ఘ పని గంటల వల్ల కార్మికుల మానసిక ఆరోగ్య సమస్యలు పెరుగుతాయన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో కార్మికుల కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయన్నారు. కార్యక్రమంలో పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సూర్యారావు, సహకార ఉద్యోగుల సంఘం నాయకులు కోలంక రాజు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, కోశాధికారి మలకా రమణ, ఇతర ప్రతినిధులు పలివెల వీరబాబు, క్రాంతి, వెంకటరమణ, నాయుడు, దుర్గాప్రసాద్, రాజబాబు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

‘ఔట్ సోర్సింగ్ వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి’

కాకినాడ సిటీ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శాసనమండలిలో మంత్రి లోకేశ్ ప్రకటన ప్రకారం మున్సిపల్ ఔట్ సోర్సింగ్ వర్కర్లకు తల్లికి వందనం, సంక్షేమ పథకాలు అమలు చేయాలని సీఐటీయూ నగర సహ కన్వీనర్ పలివెల వీరబాబు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దీనిపై కలెక్టర్ తగు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, నగర కన్వీనర్ మలక వెంకటరమణ, జిల్లా కమిటీ సభ్యుడు మేడిశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

‘అసంపూర్తి కల్యాణ మండపాన్ని పూర్తి చేస్తాం’

కాజులూరు (కరప), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాజులూరు మండలం దుగ్గుదూరులో ఏళ్ల తరబడిగా అసంపూర్తిగా ఉన్న శెట్టిబలిజ కల్యాణ మండపాన్ని పూర్తిచేసి వినియోగంలోకి తీసుకొస్తామని కూటమి నేత, మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం హామీ ఇచ్చారు. బుధవారం ఆయన గ్రామంలో పర్యటించి పనుల పునః ప్రారంభానికి శంకుస్థాపన చేశారు. కూటమి నాయకులు సత్యనారాయణ, కుడిపూడి గోవిందరావు, లకాని కృష్ణచైతన్య, చందాల బాబి, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఖాళీ యూరియా సంచులతో నిరసన తెలుపుతున్న ఎంపీటీసీలు

ఖాళీ యూరియా సంచులతో నిరసన

పిఠాపురం రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): యూరియా అందుబాటులో లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారంటూ ఎంపీటీసీలు ఖాళీ యూరియా సంచులతో నిరసన తెలిపారు. పిఠాపురం మండల పరిషత్ సమావేశం ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు అధ్యక్షతన బుధవారం వాడివేడిగా జరిగింది. రైతులకు ఎక్కడా యూరియా లభించట్లేదని ఎంపీటీసీలు తెలిపారు. ప్రైవేటు షాపుల యజమానులు యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. యూరియా అంతా అక్రమ మార్గాల్లో దళారులతో చేతుల్లోకి వెళ్లిపోతుంటే వ్యవసాయాధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. యూరియా కోసం గంటల తరబడి క్యూలో నిలుచున్నా లభించట్లేదన్నారు. రైతులకు తక్షణం యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీలు డిమాండ్ చేశారు. నాలుగేళ్లుగా మండల పరిషత్‌కు వచ్చిన నిధులు, వాటిని ఏ విధంగా వ్యయం చేశారో తెలపాలని అధికారులను ప్రశ్నించారు.


డీఏటీవో నవీన్‌చంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

‘ట్రెజరీలో బిల్లులను త్వరగా ఆమోదించాలి’

కాకినాడ రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ట్రెజరీలో బిల్లులను జాప్యం లేకుండా త్వరితగతిన ఆమోదించాలని, పలు సమస్యల పరిష్కారం కోరుతూ ఎస్టీయూ కాకినాడ జిల్లా అధ్యక్షుడు మోర్త శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు జిల్లా సహాయ ట్రెజరీ అధికారి డి.నవీన్‌చంద్‌ను బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయులకు ఆటోమెటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (ఆస్), మెడికల్ బిల్లులను పాద పద్ధతిలోనే మంజూరు చేయాలని కోరారు. సీఎఫ్ఎంఎస్‌లో ఉపాధ్యాయుల పేరు, పుట్టినతేదీ సవరణ చేయాలన్నారు. ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కాశీ విశ్వనాథ్, ఆర్థిక కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, రామకృష్ణ, రాజు, వెంకటేశ్వరరావు, కృష్ణంరాజు, వెంకట్, మియాఖాన్ పాల్గొన్నారు.

‘నక్ష’ సర్వే ప్రారంభం

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ కార్పొరేషన్ పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో నక్ష సర్వే ప్రారంభమైంది. ఎంపిక చేసిన ప్రాంతాల్లో డ్రోన్ సాయంతో జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (జీఎస్ఐ) ఆధారంగా భూ దృశ్య చిత్రాలను సేకరించి అనంతరం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహిస్తున్నారు. ప్రతి ఇల్లు, స్థలం, ఆస్తికి భౌగోళిక గుర్తులు నమోదు చేసి, ఆస్తుల వివరాలు, హద్దులు, విస్తీర్ణం డిజిటల్ పద్ధతిలో నమోదు చేయనున్నారు. ఈ విధానం ద్వారా ఆస్తి యాజమాన్యం, పట్టణ ప్రణాళిక, ప్రభుత్వ ఆదాయ వసూళ్లు, మౌలిక సదుపాయాల అభివృద్ధి మరింత మెరుగుపడనుందని అధికారులు తెలిపారు. నగరంలోని 50 డివిజన్లకు 40 బృందాలను నియమించారు. ఒక్కో బృందం రోజుకు సగటున 20 సర్వేలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. సచివాలయ ప్లానింగ్, అడ్మిన్, వీఆర్వో, ఎమినిటీ సెక్రటరీలు ఇందులో పాల్గొంటున్నారు. డీసీపీ కేవీ కృష్ణారావు మాట్లాడుతూ నక్ష సర్వే వల్ల ప్రతి ఆస్తికీ ప్రాపర్టీ కార్డు మంజూరవుతుందని, తద్వారా బ్యాంకు రుణం, ఆస్తి విలువల నిర్ధారణ సులభతరమవుతాయన్నారు. రికార్డులు డిజిటలైజ్ కావడంతో భూ వివాదాలు, అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ స్థలాలపై ఆక్రమణలకు చెక్ పడుతుందన్నారు. గ్రామ పటాలు, సర్వే నంబర్లు, నక్ష ఆధారంగా భూ నిర్మాణ రికార్డులు సిద్ధమవుతాయని వెల్లడించారు. పట్టణ, గ్రామ భూముల సరిహద్దులు, నిర్మాణ వివరాలు స్పష్టతతో తేలుతాయని, సర్వేకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు.


గుంటూరు బయల్దేరిన ఉపాధ్యాయులు

‘చలో గుంటూరు’

కాకినాడ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పీఆర్సీ ఎరియర్స్ బకాయిలు ఇప్పించాలని, ఉపాధ్యాయులకు బోధనేతర పనులు రద్దు చేయాలని, ఆన్‌లైన్ ఇతరత్రా వర్కుల భారం తగ్గించాలనే డిమాండ్లతో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున గుంటూరు తరలివెళ్లారు. బుధవారం రాత్రి పదిన్నర గంటల సమయంలో సుమారు 300 మంది కాకినాడ కలెక్టర్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహ కూడలి వద్ద నుంచి ప్రత్యేక బస్సుల్లో పయనమయ్యారు. గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిర్‌లో నిర్వహించే బహిరంగ సభ ద్వారా తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చక్రవర్తి చెప్పారు.


సమావేశంలో మాట్లాడుతున్న టౌన్ ప్లానింగ్ రీజనల్ డైరెక్టర్ నాయుడు

‘ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి’

పెద్దాపురం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అనధికార లే ఔట్ల క్రమబద్ధీకరణకు, ప్లాట్ల రెగ్యులైజేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని టౌన్ ప్లానింగ్ రీజనల్ డైరెక్టర్ నాయుడు కోరారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం కొన్ని నిర్ణయాలు తీసుకుందన్నారు. నిషేధించిన సర్వే నెంబర్లు మినహా ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న అందరికీ రెగ్యులైజేషన్ నిర్దేశిత రుసుము నిర్ణయించిందన్నారు. ఎల్ఆర్ఎస్‌పై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు.


శ్రీనివాసరావుకు అభినందనలు తెలుపుతున్న ఎంపీపీ, కార్యదర్శులు

కరప ఎంపీడీవోగా ‘సలాది’ బాధ్యతల స్వీకారం

కరప, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కరప ఎంపీడీవో (ఎఫ్ఏసీ)గా సలాది వెంకట శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు, జడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.


గొల్లపాలెం-కుయ్యేరు రోడ్డు విషయమై మీడియాతో మాట్లాడుతున్న కూటమి నాయకులు

‘కూటమి ప్రభుత్వంపై బురదజల్లితే ఉపేక్షించేది లేదు’

కాజులూరు (కరప), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ వైఫల్యాలే గొల్లపాలెం-కుయ్యేరు రోడ్డు ప్రస్తుత దుస్థితికి కారణమని, రాజకీయ లబ్ధి కోసం కూటమి ప్రభుత్వంపై బురదజల్లితే ఉపేక్షించేది లేదని కూటమి నాయకులు హెచ్చరించారు. కాజులూరులోని కూటమి పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో పలువురు గొల్లపాలెం-కుయ్యేరు రహదారి నిర్మాణంలో గత ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యం, జరిగిన జాప్యానికి గల కారణాలను వివరించారు. జనసేన నేత అన్యం శ్రీరామచంద్రమూర్తి, బీజేపీ కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శి సలాది వీరబాబు, టీడీపీ, జనసేన మండల శాఖల అధ్యక్షులు డాక్టర్ బాబు, బొండా వెంకన్న, నాయకులు డేగల సతీష్, వనుం వీరబ్రహ్మం, దడాల నాగార్జున, కోట తాతబ్బాయి, యాళ్ల రవి, వెంకట్రావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ విద్యార్థులకు శిక్షణ

ప్రత్తిపాడు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతులు విద్యార్థులకు ఒకేషనల్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. ఎలక్ట్రానిక్, ఆటోమేటివ్ ట్రేడ్‌లలో వీరికి బుధవారం స్థానిక ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ వద్ద ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చామని ఇన్‌స్ట్రక్టర్లు రాజ్‌కుమార్, విజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం సీహెచ్ జాన్‌ప్రసాద్, అసిస్టెంట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఐటీడీఏ ఎదుట మహిళల ఆందోళన

● వెలుగులో అవినీతికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్


ఆందోళన చేస్తున్న మహిళలు

చింతూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వెలుగులో జరిగిన అవినీతిని వెలికి తీసి, దానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎర్రంపేట మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారంతా చింతూరు ఐటీడీఏ ఎదుట ఆందోళన చేశారు. వీరికి మద్దతుగా పాల్గొన్న సీఐటీయూ నాయకుడు పల్లపు వెంకట్, గిరిజన సంఘం నాయుకుడు సీసం సురేష్, చింతూరు సర్పంచ్ కారం కన్నారావు మాట్లాడుతూ... వెలుగుకు చెందిన రెండు గ్రూపులలో దాదాపు రూ. 35 లక్షల మేర అవినీతి జరిగిందని ఆరోపించారు. దీంతో 200 మంది మహిళలు నష్టపోవడం జరిగిందన్నారు. ఈ అవినీతిలో కొంతమంది అధికారులకు వాటా కూడా ఉందని వారు ఆరోపించారు. తక్షణమే పూర్తి స్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. చివరిగా ఐటీడీఏ పీవో శుభం నొక్వాల్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. గ్రామ పూజారిరాజు, నాగర్జున, సుబ్బారావు, సాయి, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల అవకతవకలపై విచారణ


విచారణలో భాగంగా మాట్లాడుతున్న ఏవో

కూనవరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కూనవరం మేజర్ పంచాయతీ నిధుల అవకతవకలపై బుధవారం అధికారులు విచారణ చేపట్టారు. కొన్ని సంఘాలు పత్రికల ద్వారా సర్పంచ్ హేమంత్ గతంలో ఇక్కడ పనిచేసిన కార్యదర్శిపై ఫిర్యాదు చేయడంతో, దీన్ని సుమోటోగా స్వీకరించిన అధికారులు విచారణ చేశారు. ఈసందర్భంగా ఏవో ఎన్‌వీ సుబ్బారావు మాట్లాడుతూ పంచాయతీ నిధుల అవకతవకలపై ఫైళ్లు పరిశీలించామన్నారు. గతంలో ఆడిట్ జరిగిన ఫైళ్లతో పాటు మరికొన్ని ఫైళ్లను సీజ్ చేయడం జరిగిందన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేయడానికి కొంత సమయం పడుతుందన్నారు. విచారణ చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. అనంతరం వారు నిర్ణయం తీసుకుంటారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మోతుగూడెం పంచాయతీ కార్యదర్శి జి.మోహన్‌రావు, సీనియర్ సహాయకులు బీ.పృథ్వీ, కార్యదర్శి సీహెచ్ గంగరాజు పాల్గొన్నారు. అలాగే పంచాయతీ నిధుల అవకతవకలకు పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను డిమాండ్ చేశారు.

ఆధార్ మెగామేళాను వినియోగించుకోండి

రంపచోడవరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆధార్ మెగా మేళాను సద్వినియోగంచేసుకోవాలని ఐటీడీఏ ఏపీవో(జీ) డీఎన్వీ రమణ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆధార్ మెగా మేళా కార్యక్రమాన్ని ఆయన రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ఐదు ఆధార్ కిట్లతో సుమారు 20 మంది సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. యూనిక్ ఐడెంటిఫికేషన్ అధారిటీ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం ఆధార్ కార్డులో పేరు, తండ్రి పేరు, జనన తేది, లింగం వంటి డెమోగ్రాఫిక్ వివరాలను సవరించుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఆధార్ కోఆర్డినేటర్ డేవిడ్, పీఎంయూ అధికారులు చంద్రకళ, మోహన్, సంధ్య, ఎస్ఐ షరీఫ్, డిప్యూటీ ఎంపీడీవో వై.రాజబాబు, ఆర్ఐ నిర్మల, వీఆర్వోలు కె.శివకుమార్, ఏ.చిన్నిరాజు, పంచాయతీ కార్యదర్శి కామరాజు, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయాలి


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బంగారు వెంకటేశ్వర్లు, తదితరులు

ఎటపాక,సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చట్టబద్దతలేని లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న భద్రాచలంలో తలపెట్టిన ధర్మయుద్ధం బహిరంగ సభను విలీన మండలాల గిరిజనులు జయప్రదం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈమేరకు బుధవారం ఎటపాకలో ధర్మయుద్ధం పేరిట చలో భద్రాచలం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా బంగారు వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఎస్టీ జాబితాలోని లంబాడీలను తొలగించి, గిరిజనులకే నిధులు,నియామకాలు, రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. తెలుగు రాష్ట్రాల్లోని ఆదివాసీ కుల సంఘాలు, నాయకులు, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు మలిదశ లంబాడీల తొలగింపు ఉద్యమంకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బాడిష వెంకటేశ్వర్లు, కంగాల కోటేశ్వరరావు, తుర్రం అర్జున్, గుండి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమావేశం

చింతూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాల, పాఠశాలల్లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. బుధవారం చింతూరులో ఔట్ సోర్సింగ్ కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్‌తో ఈనెల 29న రంపచోడవరం ఐటీడీఏ ముందు ధర్నా నిర్వహించనున్నట్టు చెప్పారు. దీనికి ప్రతిఒక్కరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మికులు దుర్గారావు, వీరయ్య, చంద్రమ్మ, పుల్లమ్మ, ముత్తమ్మ, రమాదేవి, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల నిరసన విరమణ


రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న కార్మికులు

మోతుగూడెం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలుగునాడు అనుబంధ విద్యుత్ గుత్తేదారు కార్మిక సంఘం ఆధ్వర్యంలో గుత్తేదారు కార్మికులు మంగళవారం మోతుగూడెం సీఈ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు ప్రారంభించిన సంగతి తెలిసిందే. బుధవారం జరిగిన కార్యక్రమంలో సంఘ నాయకుడు సతీష్‌బాబు, మడకం సుశీల, మల్లేశ్వరరావు హాజరై మాట్లాడుతూ ఏపీజెన్‌కో విద్యుత్ కేంద్రాల్లో పనిచేస్తున్న గుత్తేదారు కార్మికులను సంస్థలో విలీనం చేసి నేరుగా వేతనాలు చెల్లించాలని కోరారు. అనంతరం మోతుగూడెం, చింతూరు టీడీపీ నాయకులు, జెన్‌కో అధికారులు వెళ్లి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. అంతకుముందు చింతూరు మండల టీడీపీ సీనియర్ నేతలు ఎండీ జాంగీర్, ఎస్‌కే జానీ మస్తాన్ వలీ, చల్లా వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, పాసి రమణ, గ్రామశాఖ అధ్యక్షుడు దొడ్డి ఏసు దారబాబు, పోలయ్య వారికి సంఘీభావం తెలిపారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

అన్నపూర్ణాదేవిగా విజయదుర్గమ్మ దర్శనం






తుని: అన్నపూర్ణాదేవిగా దర్శనమిస్తున్న తలుపులమ్మ, కోటనందూరు: కాకరాపల్లిలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు, రౌతులపూడిలో అన్నపూర్ణా దేవి అవతారంలో అమ్మవారు, ప్రత్తిపాడులో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు, ఏలేశ్వరంలో అన్నపూర్ణాదేవి అవతారంలో అమ్మవారు

తునిరూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): లోవ దేవస్థానంలో శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజు బుధవారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులను అనుగ్రహించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సామూహిక కుంకుమార్చన పూజల్లో భక్తులు పాల్గొన్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లుచేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

కోటనందూరు (ఆంధ్రజ్యోతి): నవరాత్రి ఉత్సవాల్లో మూడోరోజు బుధవారం అమ్మవారు అన్నపూర్ణదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

రౌతులపూడి (ఆంధ్రజ్యోతి):రౌతులపూడిలో కనకదుర్గ అమ్మవారు అన్నపూర్ణ దేవిగా దర్శనమిచ్చారు.

ఏలేశ్వరం,(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నవ్యజ్యోతి పాఠశాల వీధిలో అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకరణలో బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు.

ప్రత్తిపాడు, (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆలయాల వద్ద అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. ధర్మవరంలోని విజయదుర్గ అమ్మవారి ఆలయం ఎదుటఅన్నదానం నిర్వహించారు. రాచపల్లిలోని అపీతకుచాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీఆర్పీల సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా రాంజీ ప్రసాద్


నూతన కార్యవర్గం సభ్యులు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): సీఆర్పీల సంఘ రాష్ట్రఅధ్యక్షుడుగా ప్రత్తిపాడుకు చెందిన ఎలిపే రాంజీ ప్రసాద్ ఎన్నికయ్యారు. బుధవారం ఏపీ సీఆర్పీ యునిటెడ్ ఫోరం సర్వ సభ్య సమావేశం మంగళగిరిలో నిర్వహించారు. 5అనుబంధ సంఘాలు పాల్గొని రెండేళ్ల పరిమితితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎలిపే రాంజీ ప్రసాద్ ఎన్నికయ్యారు. త్వరలోనే అన్ని జిల్లాలో పర్యటించి సంఘ బలోపేతానికి కృషి చేస్తానని రాంజీ అన్నారు.

ఎమ్మెల్యే సత్యప్రభకు ధన్యవాదాలు

గిరిజన గ్రామాల ప్రజల సమస్యలు అసెంబ్లీలో ప్రస్తావన


ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అన్నవరం

ప్రత్తిపాడు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని 59 గిరిజన గ్రామాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలపై అసెంబ్లీలో గళం విప్పి వివరించిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు సబ్‌ప్లాన్ ఏజెన్సీ గిరిజనులు ధన్యవాదాలు తెలిపారు. బుధవారం ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మిడి అన్నవరం విలేకరులతో మాట్లాడారు. సబ్‌ప్లాన్ ఏజెన్సీ ప్రాంత సమస్యలు ఎంతో మంది నాయకులకు విన్నవించినా తమ గోడు పట్టించుకోలేదని, ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ తమ సమస్యలను అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లారని అన్నవరం తెలిపారు.

బవురువాకలో వైద్య శిబిరం


బవురువాకలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రత్తి పాడు,సెప్టెంబరు24(ఆంధ్ర జ్యోతి): బవురువాకలో వైద్య శాంతి ఆశ్రమం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం స్వస్థ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి కె.మురళీమోహన్ రెడ్డి 75మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ పృధ్వీరాజ్ 40మంది చిన్నారులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ కె.రమేష్, శ్రీను, నడిశెట్టి అప్పారావు, జలుమూరి అర్జునరావు, పాకల సురేష్, ఆరోగ్య సిబ్బంది తాతబాబు,యర్రబ్బాయి, రామకృష్ణ, రాజేశ్వరి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. ప్రత్తిపాడు సచివాలయం వద్ద ఐసీడీఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్టు ఆధ్వర్యంలో పోషకాహార కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు వెలుగుల నాని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చక్రవేణి, అంగన్‌వాడీ సిబ్బంది పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.

కిర్లంపూడిలో మెగా వైద్య శిబిరం

కిర్లంపూడి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీలో బీజేపీ మండలాధ్యక్షుడు శరకణం రాజబాబు ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కాకినాడ నుంచి వచ్చిన వైద్యులు మహిళలకు రక్త పరీక్షలు చేసి మందులు అందజేశారు. పీహెచ్‌సీ డాక్టర్ రాంబాబునాయక్ ఆరోగ్యంపై పలు సూచనలు ఇచ్చారు.గుడాల రాంబాబు, సింగిలిదేవి సత్తిరాజు, యడాలి రాంబాబు, అల్లు శివరామకృష్ణ, కంట కాశీవిశ్వనాదం పాల్గొన్నారు.

'అదనపు పని విధానాన్ని రద్దు చేయాలి'

ప్రత్తిపాడు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేస్తున్న 10 గంటల పని విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆల్ ఇండియా లాయర్ల యూనియన్ల ఆధ్వర్యంలో బుధవారం ప్రత్తిపాడులో ప్రదర్శన నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావు, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ నాయకులు నాగ మల్లేశ్వరరావు, సీహెచ్‌డీ సత్యవేణి, అనంతలక్ష్మి, సత్యవతి, రమాదేవి, శాంతకుమారి, నాగరత్నం, కొమరిగిరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దళితుల రణభేరికి శంఖవరం నేతలు

శంఖవరం, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): విజయవాడలో దళితుల రణభేరి బహిరంగ సభకు బుధవారం నియోజకవర్గం నుంచి నేతలు, కార్యకర్తలు తరలివెళ్లారు. బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గునపర్తి అపురూప్ ఆధ్వ ర్యంలో శంఖవరం నుంచి బస్సుల్లో బయలుదేరారు. కార్యక్ర మంలో పార్టీ సెక్రటరీ బత్తిన తాతాజీ, మం డలాధ్యక్షుడు గుణపర్తి రాఘవ, రమణ, సత్యానారాయణ, గుడాల జాన్ తదితరులు పాల్గొన్నారు.


అన్నవరంలో మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్‌కు వేదాశీర్వచనం అందిస్తున్న వేద పండితులు

సత్యదేవుడి సన్నిధిలో మాజీ ఎంపీ పూజలు

అన్నవరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిదిలో బుధవారం రాజమండ్రి మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ కుటుంబ సభ్యులతో స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు దేవస్థానం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంటా విష్ణు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం ఆయనకు వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.


ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీనివాస్

ఎరువుల దుకాణాల తనిఖీ

గండేపల్లి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మల్లేపల్లిలోని శ్రీదేవి ఎంటర్‌ప్రైజెస్, శ్రీగణేష్ ఎంటర్‌ప్రైజెస్ ఎరువుల దుకాణాలను ఏడీఏ జి.శ్రీనివాస్ తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు తనిఖీ చేసి నాణ్యమైన మందులు విక్రయిస్తున్నారో లేదో శాంపిల్స్ తీసుకుని పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో జె.లక్ష్మి, ఏఈవో చంద్రమౌళి, సొసైటీ ప్రెసిడెంట్ డి.శ్రీను తదితరులు ఉన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న డీపీవో రవికుమార్

పారిశుధ్య పనుల పరిశీలన

గండేపల్లి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): గండేపల్లిలో పారిశుధ్య పనులను బుధవారం జిల్లా డీపీవో రవికుమార్ పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శికి ఫణీంద్రకుమార్‌కు ఆయన పలు సూచనలు చేశారు. చెత్త సేకరిస్తున్నారా లేదా నేరుగా స్థానిక మహిళలను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య కార్మికులు బాగానే పనిచేస్తున్నారని అభినందించారు. అనంతరం వర్మికంపోస్టు షెడ్డును పరిశీలించారు. ఖాళీ స్థలంలో కొబ్బరి, మామిడిచెట్లు పెంచి పంచాయతీకి ఆదాయం వచ్చేలా చూడాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి

తుని రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని టీడీపీ నాయకుడు, తాండవ షుగర్స్ మాజీ ఛైర్మన్ ఎస్.లోవరాజు అన్నారు. మహిళా మండల అధ్యక్షురాలు తమరాన వరలక్ష్మి, రామకృష్ణ, మాజీ సర్పంచ్ తమరాన సత్యనారాయణతో కలిసి గ్రామంలో గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. పశువైద్యులు ఎన్.గోపి, యానిమల్ అసిస్టెంట్ పి.శ్యామల, పశుసంవర్ధక సిబ్బంది ఉన్నారు.


అవార్డు అందుకుంటున్న దృశ్యం

బెనబాబుకు ఇంటర్నేషనల్ పీస్ ఐకాన్ అవార్డు

అన్నవరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఆర్ఎంపీ వైద్యుడిగా సేవలందిస్తూ పలు సేవా కార్యక్రమాల్లో చురుకుగా వ్యవహరిస్తున్న డాక్టర్ పదిలం బెనబాబుకు ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ పీస్ ఐకాన్ అవార్డు వరించింది. బుధవారం ఆయనకు అసోసియేషన్ అధినేత డాక్టర్ రాజా యోనాహ్, కాకినాడ జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కె ప్రసాద్ నుంచి అవార్డు అందుకున్నారు.


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

కార్మికుల పని గంటల తీర్మానాన్ని రద్దు చేయాలి

తుని రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్మికుల పని గంటలు పెంచుతూ శాసనసభలో చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు తుని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టింది. వారి దీక్షకు వైసీపీ నాయకులు సంఘీభావం తెలిపారు. సీఐటీయూ నాయకులు శ్రీనివాస్, కామేశ్వరి, బాబురావు, అనిల్ కుమార్, భవాని, అరుణ, లక్ష్మణ్, విజయ ఉన్నారు.


అధ్యాపకులను అభినందిస్తున్న ఆదిత్య సిబ్బంది

శాస్త్రవేత్తల జాబితాలో 'ఆదిత్య' ప్రొఫెసర్లు

గండేపల్లి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రపంచ టాప్ 2శాతం శాస్త్రవేత్తల జాబితా 2025లో సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీ ఐదుగురు ప్రొఫెసర్లు ఎంపికైనట్టు తెలియజేస్తున్నామని ప్రొ చాన్సలర్ డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి తెలిపారు. ప్రతిష్టాత్మక ఎల్సేవియర్, స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీ తయారు చేసిన టాప్ 2 శాతం శాస్త్రవేత్తల జాబితాలో తమ ప్రొఫెసర్లు మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎలుమలై, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ మహేష్‌కుమార్ సింగ్, సివిల్ ఇంజనీరింగ్ విభాగం హెడ్ డాక్టర్ బెల్లం రామ్మోహనరెడ్డి, మెకానికల్ ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ సుబ్రహ్మణ్యం రంజిత్, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ తాతబాబు చోటు దక్కించుకున్నారన్నారు. 2024లో ఈ జాబితాలో ముగ్గురు అధ్యాపకులు చోటు దక్కించుకోగా, 2025లో ఐదుగురు ఉండడం ద్వారా విశ్వవిద్యాలయం అంతర్జాతీయ స్థాయిలో తన పరిశోధన వైభవాన్ని చాటుతోందని సతీష్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐదుగురు ప్రొఫెసర్లను ఆదిత్య యాజమాన్యం, ప్రతినిధులు అభినందించారు.

గులాబీ రంగు పురుగు ఉధృతిపై అప్రమత్తంగా ఉండాలి


చామవరంలో పత్తిపంటను పరిశీలిస్తున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త శర్మ

తుని రూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): గులాబీ రంగు పురుగు ఉధృతిపై పత్తిరైతుల్లో అప్రమత్తం అవసరమని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శర్మ తెలిపారు. తుని మండలం చామవరంలో వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పంటలను పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు. 40-60 రోజుల పంటకి లింగాకర్షక బుట్టలు, వేపనూనె పిచికారీ లాంటి సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట ఏవో అశోక్ తదితరులున్నారు.

విద్యార్థి దశ నుంచే సేవా భావం కలిగి ఉండాలి

ఏలేశ్వరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే సేవా భావం కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు హితవు పలికారు. బుధవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఇన్‌చార్జి ప్రయాగమూర్తి నేతృత్వంలో జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వయోజన విద్య ఆవశ్యకత, పరిసరాలను శుభ్రంగా ఉంచడం తదితర పలు అంశాలపై అవగాహన కల్పించారు. అధ్యాపకులు బొటానికల్ గార్డెన్‌లో మెక్కలు నాటారు. కార్యక్రమంలో సురేష్, పుష్పా, రామలక్ష్మి, సత్యనారాయణ, ధర్మరాజు, కళావతి, మదీనా, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరం డిగ్రీ కళాశాలలో అవగాహన కల్పిస్తున్న వైస్ ప్రిన్సిపాల్

'షాపుల్లో విలువైన ఆభరణాలు, నగదు ఉంచొద్దు'

జగ్గంపేట, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట, కిర్లంపూడి, గండేపల్లి ప్రాంతాల్లో పెట్రోల్ బంకులు, గోల్డ్, సిల్వర్ షాపుల్లో విలువైన ఆభరణాలు నగదు ఉంచవద్దని జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఓ ప్రకటనలో కోరారు. సీసీ కెమెరాల పనితీరు పరిశీలన చేసుకోవాలన్నారు.

కారు వివరాలు తెలపండి: సీఐ



జగ్గంపేట, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆర్‌జె 50యూఏ 4616 నెంబరు గల తెలుపు రంగు ఇన్నోవా కారు ఎక్కడైనా కనిపిస్తే తమకు తెలియజేయాలని జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ కోరారు. వివరాలు తెలిపేవారు సీఐ 94407 96529, పెద్దాపురం ఎస్‌డీపీవో 94407 96508, కిర్లంపూడి ఎస్ఐ 94409 04834 సంప్రదించాలని కోరారు.

పాదయాత్రగా విజయవాడకు


విజయవాడ వెళ్తున్న భవానీ భక్తులు

శంఖవరం, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): శంఖవరానికి చెందిన భవానీ భక్తులు పాదయాత్రగా విజయవాడ కనకదుర్గ అమ్మవారి దర్శనానికి బయలుదేరారు. బుధవారం మొగిలి కామేశ్వరరావు గురుభవానీ ఆధ్వర్యంలో శంఖవరం నుంచి పాదయాత్ర ప్రారంభించారు. టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భవానీల పాదయాత్ర


కాలినడకన విజయవాడ వెళ్తున్న దృశ్యం

కిర్లంపూడి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేగా జ్యోతుల నెహ్రూ గెలిస్తే కాలినడకన విజయవాడ వస్తామని కిర్లంపూడి మండలం బూరుగుపూడికి చెందిన మీసాల నాగేశ్వరరావు మొక్కుకున్నారు. ఎమ్మెల్యే నెహ్రూ గెలుపుతో మొక్కు తీర్చుకునేందుకు బుధవారం నాగేశ్వరరావు భార్య, కుమార్తెలు, భవానీ భక్తులు కాలినడకన విజయవాడ పయనమయ్యారు. పాదయాత్రలో కుంచే తాతాజీ, మూరా సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.